www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 76 | మంగళవారం | 27 అక్టోబర్, 2026



6

సెర్బియాలో విద్యార్థి ఉద్యమం సంచలనం



కరువు ముప్పుపై అఖిలపక్ష భేటీ

2

- ఎల్‌నినో, వర్షాభావంపై ఉమ్మడి కార్యాచరణకు ప్రభుత్వం సిద్ధం
- భట్టి విక్రమార్క అధ్యక్షతన రేపు సమావేశం
- ఈ నెల 31న కరువు మండలాల వివరాలు కేంద్రానికి
- రైతులకు సాయం, తాగునీరు, విద్యుత్ సరఫరాపై చర్చ



2

చర్చలు పూర్తి.. త్వరలోనే ఒప్పందం

- భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందానికి తుది మెరుగులు
- నాలుగున్నరేళ్లలో భారత్ 9స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

పరువునష్టం కేసులో రాహుల్‌గాంధీ నిర్దోషి

- అమిత్ షాపై వ్యాఖ్యల కేసులో కోర్టు తీర్పు
- అప్పీల్‌కు వెళ్తాం: ఫిర్యాదుదారు

2

ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ దేశవ్యాప్తంగా నిరసనలు

- మోదీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్
- కాంగ్రెస్ అధ్యక్షుడి దిష్టిబొమ్మల దహనం

2



తుమ్మిడిహెట్టికి మళ్లీ కదలిక!

బ్యారేజీ ఎత్తు పెంపు ప్రతిపాదనపై మహారాష్ట్ర సానుకూలత

- ముంపు, నీటి లభ్యతపై సమగ్ర అధ్యయనానికి సంయుక్త కమిటీ
- ప్రభావిత రైతులకు పూర్తి పరిహారం చెల్లిస్తాం: మంత్రి ఉత్తమ్
- ఆదిలాబాద్ గిరిజనుల సాగు, తాగునీటి అవసరాలు తీర్చడమే లక్ష్యం
- ఫలించిన చర్చలు.. ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి

ప్రజానావ, హైదరాబాద్: ఐదు దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమైన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి మళ్లీ కదలిక వచ్చింది. బ్యారేజీ ఎత్తును ప్రస్తుత ఒప్పందంలోని 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు పెంచాలన్న తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనపై మహారాష్ట్ర సానుకూలంగా స్పందించింది. తమ రాష్ట్ర ప్రయోజనాలకు, ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూస్తూనే ప్రతిపాదనను పరిశీలిస్తామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. ముంపు, నీటి లభ్యత, పర్యావరణ, సాంకేతిక అంశాలపై అధ్యయనం చేసేందుకు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శులతో సంయుక్త కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్‌హౌస్‌లో సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం ఫడ్నవీస్‌తో సమావేశమైంది. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె.రామకృష్ణారావు, ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాణహిత నదిపై బ్యారేజీ నిర్మాణం, ఎత్తు పెంపు, మహారాష్ట్రలో ముంపు, భూసేకరణ, పరిహారం తదితర అంశాలపై చర్చించారు.

గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు అవకాశం

బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచితే గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశం మెరుగుపడుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. దీంతో పంపింగ్ అవసరం తగ్గి విద్యుత్ వినియోగం, నిర్వహణ వ్యయాలు ఆదా అవుతాయని తెలిపారు. ప్రాజెక్టు సాంకేతిక, ఆర్థిక ప్రయోజనాలను ప్రజెంటేషన్ ద్వారా మహారాష్ట్ర బృందానికి వివరించారు. బ్యారేజీ కారణంగా ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు మహారాష్ట్ర నిబంధనల ప్రకారం పూర్తి పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

ఆదివాసీల అభ్యున్నతికి కీలకం

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి, గిరిజనుల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఆదివాసీలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. కొమురం భీమ్ నినాదమైన 'జల్, జంగిల్, జమీన్'ను ప్రస్తావిస్తూ.. గిరిజనుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు రెండు రాష్ట్రాలు కలిసి పనిచేయాలని కోరారు. ప్రాజెక్టుతోపాటు ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత



రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయాలు కూడా ప్రాంతీయ అభివృద్ధికి, ఉపాధి అవకాశాల పెంపునకు దోహదపడతాయని వివరించారు.

ప్రయోజనాలకు భంగం కలగకూడదు

తెలంగాణ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన ఫడణవీస్.. మహారాష్ట్ర ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా సాంకేతిక అంశాల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ముంపు, పర్యావరణ ప్రభావం, భూసేకరణ, నీటి లభ్యతపై సమగ్ర పరిశీలన అవసరమన్నారు. రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలోని సంయుక్త కమిటీ వివిధ ఎత్తుల వద్ద ముంపు విస్తీర్ణం, ప్రభావిత భూములు, పరిహారం తదితర అంశాలను అధ్యయనం చేయనుంది. కేంద్ర జలసంఘం సాంకేతిక పరిశీలనతో సమన్వయం చేసుకుంటూ తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. ఫడ్నవీస్‌తో చర్చలు ఫలవంతంగా ముగిశాయని సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా తెలిపారు. తెలంగాణ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించిన మహారాష్ట్ర సీఎంకు కృతజ్ఞతలు చెప్పారు. ఆదిలాబాద్ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేందుకు మహారాష్ట్ర సహకరిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. డిసెంబర్‌లో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు హాజరు కావాలని ఫడ్నవీస్‌ను ఆహ్వానించగా, ఆయన సానుకూలంగా స్పందించారు.

సర్ నిర్ణయాలన్నీ ఏకగ్రీవమే!

- సుప్రీంకోర్టుకు ఎన్నికల సంఘం అఫిడవిట్
- మూడు కీలక ఉత్తర్వులకూ కమిషనర్ల ఏకాభిప్రాయం
- పిటిషన్లు వార్తా కథనాల ఆధారంగానే దాఖలయ్యాయని వెల్లడి
- ఫారం–6లో ఎలాంటి మార్పులూ చేయలేదని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై తలెత్తిన వివాదానికి సంబంధించి భారత ఎన్నికల సంఘం సుప్రీంకోర్టులో తన నిర్ణయాలను సమర్థించుకుంది. ఎస్ఐఆర్‌కు సంబంధించి జారీ చేసిన మూడు కీలక ఉత్తర్వులనూ ముగ్గురు ఎన్నికల కమిషనర్లు ఏకగ్రీవంగానే ఆమోదించారని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లు వార్తాపత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా ఉన్నాయని పేర్కొంటూ వాటిని కొట్టివేయాలని కోర్టును కోరింది. ఈ మేరకు సోమవారం అఫిడవిట్ దాఖలు చేసింది. 2025 జూన్, అక్టోబర్, 2026 మే నెలల్లో ఎస్ఐఆర్‌కు సంబంధించి జారీ చేసిన మూడు ఉత్తర్వులూ ఏకగ్రీవంగా ఆమోదం పొందాయని ఎన్నికల సంఘం తెలిపింది. నిర్ణయాలు తీసుకునే సమయంలో అధికారుల సూచనలు, పరిశీలనలు, సందేహాలు, భిన్నాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని వివరించింది. ఫైళ్ల పరిశీలన సందర్భంగా కమిషనర్లు వ్యక్తం చేసే అభిప్రాయాలు, ప్రశ్నలు, సూచనలను తుది నిర్ణయాలుగా భావించరాదని పేర్కొంది. ఎన్నికల సంఘంలోని సంబంధిత విభాగాలు సిద్ధం చేసిన ఫైళ్లను తొలుత ఒక ఎన్నికల కమిషనర్, ఆ తర్వాత మరో కమిషనర్, చివరగా ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) పరిశీలిస్తారని అఫిడవిట్‌లో వివరించింది. ఆమోదించిన నిర్ణయాలను ఫైళ్లలో నమోదు చేసి, సంబంధిత కమిషనర్లు, సీఈసీ సంతకాలు చేస్తారని తెలిపింది. అనంతరం ఎన్నికల సంఘం కార్యదర్శిత్వం వాటిని అధికారికంగా ప్రకటించి అమలు చేస్తుందని పేర్కొంది. 2023 చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం, ఫైళ్ల పరిశీలన సమయంలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు, ప్రశ్నలు, సూచనలే ఎన్నికల సంఘం తుది నిర్ణయాలు కావని స్పష్టం చేసింది.



ఫారం–6లో మార్పుల్లేవు

ఎస్ఐఆర్ ప్రక్రియలో కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే చట్టబద్ధమైన ఫారం–6లో మార్పులు చేశారన్న ఆరోపణలను ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. సంబంధిత మూడు ఉత్తర్వుల వల్ల ఫారం–6లో ఎలాంటి మార్పులూ జరగలేదని వెల్లడించింది. కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం–6కు, ఎస్ఐఆర్‌లో భాగంగా వినియోగించే 'డిక్లరేషన్ ఫారం'కు మధ్య వ్యత్యాసం ఉందని వివరించింది. డిక్లరేషన్ ఫారం ప్రత్యేకంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రవేశపెట్టిన పత్రం అని తెలిపింది.

కమిషనర్ల అభ్యంతరాలపై కథనం

ఎన్నికల సంఘంలోని కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలకు కొన్ని కీలక నిర్ణయాలపై ముందస్తు సమాచారం ఇవ్వలేదని, వారు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పాటు ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారని ఇటీవల ఓ వార్తాపత్రిక కథనం పేర్కొంది. దీంతో ఎన్నికల సంఘం నిర్ణయాలు తీసుకున్న విధానంపై వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో దాఖలైన పిటిషన్లు వార్తా కథనాల ఆధారంగానే ఉన్నాయని ఎన్నికల సంఘం తన అఫిడవిట్‌లో పేర్కొంది.

సీఈసీని తొలగిస్తే 30 సెకన్లలో నిరసనలు ఆగుతయ్

- ప్రధాని మోదీకి వ్యాపారులు చెప్పాలి : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ
- నవంబరు 1 ర్యాలీ వాయిదా వేయాలని వ్యాపార సంఘం విజ్ఞప్తి

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని ప్రధాని నరేంద్ర మోదీకి వ్యాపారులు చెప్పాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సూచించారు. ఆయనను తొలగిస్తే 30 సెకన్లలో నిరసనలు ఆగిపోతాయని వ్యాఖ్యానించారు. 'ఓటు చోరీ' ఆరోపణలపై నవంబరు 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించనున్న ర్యాలీని వాయిదా వేయాలని వ్యాపార సంఘం కోరిన నేపథ్యంలో సోమవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఓట్లు చోరీకి గురైతే దుకాణాలు, పొదుపు సొమ్ము, పిల్లల భవిష్యత్తు కూడా సురక్షితంగా ఉండవని రాహుల్ పేర్కొన్నారు. ఢిల్లీలో మెట్రో సేవలు నిలిపివేసి, రహదారులు మూసివేసి రాజధానిని దిగ్బంధించారని ఆరోపించారు.

రూ.10 వేల కోట్ల వ్యాపారానికి నష్టం?

నవంబరు 1న ర్యాలీని కనీసం నవంబరు 10 తర్వాత నిర్వహించాలని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) కోరింది. దీపావళి కొనుగోళ్ల సమయంలో ర్యాలీ నిర్వహిస్తే సుమారు రూ.10 వేల కోట్ల వ్యాపారానికి అంతరాయం కలగవచ్చని సీటీఐ చైర్మన్ బృజేశ్ గోయల్ ఆందోళన వ్యక్తం చేశారు. రామ్‌లీలా మైదానం పరిసరాల్లోని మార్కెట్లపై ప్రభావం పడుతుందని తెలిపారు. ధన్‌తేరస్ తరువాయి 2లో..



సీఈసీని తొలగిస్తే 30 సెకన్లలో నిరసనలు ఆగుతయ్

(మొదటిపేజీ తరువాయి)

ధన్‌తేరస్ సందర్భంగా ఢిల్లీలో బంగారం, వెండి, ఎలక్ట్రానిక్స్, దుస్తులు, వాహనాలు తదితర రంగాల్లో సుమారు రూ.25 వేల కోట్ల వ్యాపారం జరుగుతుందని పేర్కొన్నారు. పండుగల సమయంలో మార్కెట్లలో రద్దీ ఎక్కువగా ఉంటుందని, ర్యాలీ వల్ల వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటారని వివరించారు.

ఎస్ఐఆర్‌పై ఒత్తిడికి ర్యాలీ

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామాను డిమాండ్ చేయడం లక్ష్యంగా ఇండియా కూటమి ఈ ర్యాలీకి పిలుపునిచ్చింది. అక్టోబరు 12న ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలు, పౌరసమాజ ప్రతినిధులు 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' నిర్వహించి, ఎస్ఐఆర్‌పై సంయుక్త పిటిషన్ దాఖలు చేశారు.

పరువునష్టం కేసులో రాహుల్ నిర్దోషి

- అమిత్ షాపై వ్యాఖ్యల కేసులో కోర్టు తీర్పు
- అప్పీల్‌కు వెళ్తాం: ఫిర్యాదుదారు

సుల్తాన్‌పూర్: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి పరువునష్టం కేసులో ఊరట లభించింది. 2018లో అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి దాఖలైన కేసులో సుల్తాన్‌పూర్ ప్రత్యేక ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు సోమవారం ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. ప్రత్యేక న్యాయమూర్తి శుభమ్ వర్మ తీర్పు వెలువరించారు. తీర్పు సమయంలో రాహుల్‌గాంధీ కోర్టుకు హాజరయ్యారు. ఆయన నిర్దోషిగా విడుదలైనట్లు ఫిర్యాదుదారు విజయ్ మిశ్రా తరపు న్యాయవాది సంతోష్ పాండే తెలిపారు. తీర్పు ప్రతిని పరిశీలించి, తన క్లయింట్‌తో చర్చించిన అనంతరం అప్పీలుకు వెళ్లాలని భావిస్తున్నట్లు చెప్పారు. సరిపడా సాక్ష్యాలు లేనందునే రాహుల్‌గాంధీని నిర్దోషిగా ప్రకటించారని విజయ్ మిశ్రా పేర్కొన్నారు. మరోవైపు, కాంగ్రెస్ శ్రేణులు కోర్టు వెలుపల సంబరాలు చేసుకున్నాయి.

2018లో కేసు నమోదు

2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు బెంగళూరులో జరిగిన సభలో అమిత్ షాపై రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై సుల్తాన్‌పూర్‌కు చెందిన బీజేపీ నేత విజయ్ మిశ్రా అదే ఏడాది ఆగస్టు 4న పరువునష్టం ఫిర్యాదు చేశారు. 2023లో కోర్టుకు హాజరైన రాహుల్‌గాంధీ బెయిల్ పొందారు. తీర్పు నేపథ్యంలో కోర్టు పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. లక్నో నుంచి సుల్తాన్‌పూర్‌కు రాహుల్ గాంధీ కాన్వాయ్ వెళ్తుండగా వెనుక వస్తున్న వాహనాల్లో సుమారు ఆరు వాహనాలు ఢీకొన్నాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ తీవ్ర గాయాలు కాలేదని వెల్లడించారు.

యూరప్‌లో ఎండల బీభత్సం

- 50 వేల మంది మృతి

లండన్: యూరప్ నగరాల్లో వేసవి తీవ్ర ఉష్ణోగ్రతలు వేలాది మంది ప్రాణాలను బలిగొన్నాయి. వేడి సంబంధిత మరణాల విషయంలో ఈ వేసవి సరికొత్త రికార్డును నమోదు చేసింది. యూరప్ వ్యాప్తంగా సుమారు 50 వేల మంది ప్రాణాలు కోల్పోయినట్లు 'నేచర్ హెల్త్'లో ప్రచురితమైన రెండు అధ్యయనాలు వెల్లడించాయి. ఈ మరణాల్లో మూడింట రెండొంతుల వరకు వాతావరణ మార్పులు, శిలాజ ఇంధనాల వినియోగం వల్ల ఏర్పడే కాలుష్యంతో ముడిపడి ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఈ అధ్యయనాలు సూచిస్తున్నాయి.

చర్చలు పూర్తి.. త్వరలోనే ఒప్పందం

- భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందానికి తుది మెరుగులు
- నాలుగున్నరేళ్లలో భారత్ 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

హేగ్: భారత్–అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు దాదాపు పూర్తయ్యాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ప్రస్తుతం ఒప్పందానికి తుది మెరుగులు దిద్దుతున్నామని సోమవారం వెల్లడించారు. రెండు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా నెదర్లాండ్స్ చేరుకున్న ఆయన.. వ్యాపార ప్రతినిధుల బృందంతో కలిసి పర్యటిస్తున్నారు. హేగ్‌లో జరిగిన భారత్–నెదర్లాండ్స్ బిజినెస్ ఫోరంలో గోయల్ మాట్లాడుతూ.. గత నాలుగున్నరేళ్లలో భారత్ తొమ్మిది స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుందని పేర్కొన్నారు. భారత్, అమెరికా ఈ ఏడాది ఫిబ్రవరిలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తొలి దశకు సంబంధించిన చట్రాన్ని ఖరారు చేసినట్లు ప్రకటించాయి. అయితే అమెరికా సుంకాల విధానంలో మార్పుల కారణంగా ఒప్పందంపై మరిన్ని చర్చలు జరపాల్సి వచ్చిందని తెలిపారు.

తుఫాన్ ముప్పు.. రాష్ట్రపతి ఒడిశా పర్యటన వాయిదా

భువనేశ్వర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా బలపడే అవకాశం ఉండటంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒడిశా పర్యటన వాయిదా పడింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, భద్రతాపరమైన జాగ్రత్తల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో రాష్ట్రపతి ఒడిశాలోని రాయ్‌రంగ్‌పూర్‌తోపాటు తన సొంత జిల్లా మయూర్‌భంజ్‌లో పర్యటించాల్సి ఉంది. అయితే తీర ప్రాంతాల్లో తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం నేపథ్యంలో పర్యటన తేదీలను మార్చినట్లు ప్రధాన కార్యదర్శి కార్యాలయ అధికారి వెల్లడించారు. రాష్ట్రపతి పర్యటన పూర్తిగా రద్దు కాలేదని, కేవలం తేదీలు మాత్రమే మారాయని మయూర్‌భంజ్ జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం నవంబరు 4, 5 తేదీల్లో ద్రౌపది ముర్ము మయూర్‌భంజ్‌లో పర్యటించనున్నట్లు తెలిపింది. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ శనివారం వెల్లడించింది. ఈ నెల 28 ఉదయానికి ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాల మధ్య ఎక్కడో ఒకచోట తుఫాన్ తీరం దాటవచ్చని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో తీర ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులను అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు.

ఎన్నికల కమిషనర్ల నియామకంలో రాజకీయ జోక్యం వద్దు

- స్వతంత్ర నియామక వ్యవస్థతోనే ప్రజాస్వామ్యానికి రక్షణ
- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభయ్ ఓకా

థానే: ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియ రాజకీయ ఆధిపత్యానికి అతీతంగా, స్వతంత్రంగా సాగాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభయ్ ఓకా అభిప్రాయపడ్డారు. రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రతను కాపాడేందుకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన నియామక వ్యవస్థ అవసరమని స్పష్టం చేశారు. థానేలో ఆదివారం 'భావప్రకటన స్వేచ్ఛ.. మనం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాసంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామకంలో రాజకీయ జోక్యాన్ని నిరోధించేందుకు తగిన చట్టపరమైన రక్షణలు ఉండాలని ఓకా పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వంటి వ్యక్తులను పదవి నుంచి తొలగించే పరిస్థితులు ఎదురైతే ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయనే అంశాన్ని కూడా పరిశీలించాలన్నారు. సుమారు 14 ఏళ్ల క్రితమే మాజీ ఉపప్రధాని ఎల్.కె. అద్వానీ కొలీజియం తరహా నియామక విధానాన్ని ప్రతిపాదించారని గుర్తుచేశారు. ప్రధానమంత్రి, కేంద్ర న్యాయశాఖ మంత్రి, లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష నేతలు, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ద్వారా ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేయడం స్వతంత్ర నియామకాలకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.





ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ దేశవ్యాప్తంగా నిరసనలు

- మోదీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్
- కాంగ్రెస్ అధ్యక్షుడి దిష్టిబొమ్మల దహనం, పలుచోట్ల ఆందోళనలు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ సోమవారం దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించింది. ఖర్గే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, కాంగ్రెస్ పార్టీ కూడా దీనిపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఢిల్లీ, బిహార్, జమ్మూ, బెంగళూరు సహా పలు ప్రాంతాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. బిహార్ తొలి ముఖ్యమంత్రి శ్రీకృష్ణసింగ్ 139వ జయంతి సందర్భంగా ఆదివారం పట్నాలో నిర్వహించిన కార్యక్రమంలో ఖర్గే మాట్లాడుతూ.. ఓ ప్రేక్షకుడు ప్రధాని ఎక్కడికీ వెళ్లరని వ్యాఖ్యానించగా, దానికి స్పందిస్తూ 'మోదీ కా బాప్ భీ జాయేగా' అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో రాజకీయంగా దుమారం రేగింది. ఢిల్లీలోని రాజాజీ మార్గ్‌లో ఉన్న ఖర్గే నివాసం సమీపంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. సేనాభవన్ సర్కిల్ నుంచి ఆయన నివాసం వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. బిహార్ బీజేపీ అధ్యక్షుడు సంజయ్ సరోగి నేతృత్వంలో పార్టీ కార్యాలయం నుంచి పట్నాలోని డాక్ బంగ్లా చౌరస్తా వరకు 'జన్ ఆగ్రోశ్ మార్చ్' నిర్వహించారు. అనంతరం ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆధునిక బిహార్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన శ్రీకృష్ణసింగ్ జయంతి వేదికను ప్రధాని తండ్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసేందుకు ఉపయోగించుకోవడం సరికాదని సరోగి విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ వరుసగా వెనుకబడుతోందని, కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి తమ వైఖరిని మార్చుకోవాలని వ్యాఖ్యానించారు. జమ్మూలో డోగ్రా చౌక్ వద్ద బీజేపీ ఎమ్మెల్యే షగున్ పరిహార్, యువమోర్చా జమ్మూకశ్మీర్ అధ్యక్షుడు అరుణ్ ప్రభాత్ ఆధ్వర్యంలో నిరసన జరిగింది. సాంబా, కథువా, పూంచ్, ఉధంపూర్, రాజౌరి సహా పలు జిల్లాల్లోనూ ఆందోళనలు నిర్వహించారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆదిత్య సాహు, ప్రతిపక్ష నేత బాబూలాల్ మరాండీ సహా పలువురు నాయకులు కాంగ్రెస్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలను సహించబోమంటూ నినాదాలు చేశారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్, తెలంగాణలోనూ నిరసనలు జరిగినట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి.

బెంగళూరులో బీజేపీ నేతల అరెస్టు

బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో బీజేపీ నేతలు నిరసన చేపట్టి, విధానసౌధ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటక అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఆర్. అశోక, శాసనమండలిలో ప్రతిపక్ష నేత చలవాది నారాయణస్వామి, అశ్వత్ నారాయణ, సి.పి. రామమూర్తి, ఎమ్మెల్సీ ఎన్. రవికుమార్ తదితరులను ఉప్పర్‌పేట్ పోలీస్టేషన్‌కు తరలించారు.



కరువు ముప్పుపై అఖిలపక్ష భేటీ

- ఎల్‌నినో, వర్షాభావంపై ఉమ్మడి కార్యాచరణకు ప్రభుత్వం సిద్ధం
- భట్టి విక్రమార్క అధ్యక్షతన రేపు సమావేశం
- ఈ నెల 31న కరువు మండలాల వివరాలు కేంద్రానికి
- రైతులకు సాయం, తాగునీరు, విద్యుత్ సరఫరాపై చర్చ

ప్రజానావ, హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, భూగర్భ జలమట్టాల తగ్గుదలతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉండటంతో ప్రభుత్వం ముందస్తు చర్యలకు సిద్ధమవుతోంది. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాజకీయ పార్టీల సూచనలు, అభిప్రాయాలు స్వీకరించి ఉమ్మడి కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు సచివాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఎల్‌నినో ప్రభావంపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల మంత్రులతో సమీక్షలు నిర్వహించారు. భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన కేబినెట్ కమిటీ కూడా కరవు పరిస్థితులు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించింది. తాజాగా రాజకీయ పార్టీలను భాగస్వాములను చేసి సమగ్ర కార్యాచరణ రూపొందించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరవు మండలాలను గుర్తించి, ఆ వివరాలను ఈ నెల 31న కేంద్రానికి పంపి ఆర్థిక సాయం కోరాలని ప్రాథమికంగా నిర్ణయించింది.

తాగునీరు, విద్యుత్‌పై దృష్టి

ఎల్‌నినో ప్రభావంతో రిజర్వాయర్లలో నీటి నిల్వలు, భూగర్భ జలమట్టాలు తగ్గే అవకాశాల నేపథ్యంలో తాగునీటి సరఫరా, విద్యుత్ డిమాండ్, గ్రామీణ ప్రాంతాల్లో నీటి అవసరాలపై సమావేశంలో చర్చించనున్నారు. విద్యుత్ కోతలు లేకుండా సరఫరా కొనసాగించడం, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించడం, సమస్యలు తీవ్రం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టడంపై దృష్టి సారించనున్నారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు, డెడ్ స్టోరేజీ పరిస్థితులు, వర్షపాతం లోటు తదితర అంశాలనూ సమీక్షించనున్నారు. ఇక రానున్న రబీ సీజన్‌లో నీటి లభ్యతకు అనుగుణంగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా రైతులకు అవగాహన కల్పించడంపైనా చర్చించనున్నారు. వ్యవసాయ శాఖ ద్వారా తగిన మార్గదర్శకాలు జారీ చేయడం, పంట నష్టాలను తగ్గించేందుకు ప్రణాళికలు రూపొందించడం, కరవు ప్రభావిత ప్రాంతాల్లో రైతులకు సహాయం అందించే మార్గాలను పరిశీలించనున్నారు.

కేంద్ర సాయం కోసం సమన్వయం

అఖిలపక్ష సమావేశంలో వచ్చే సూచనల ఆధారంగా తదుపరి కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వం భావిస్తోంది. అవసరమైతే అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర హోంశాఖ మంత్రితో చర్చించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల సూచించారు. కేంద్రం నుంచి ఆర్థిక సాయం, ఇతర సహకారం పొందడంతో పాటు రాష్ట్రంలో కరవు ముప్పును సమర్థంగా ఎదుర్కొనేందుకు రాజకీయ పార్టీల సమన్వయంతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ఇరాన్‌పై మళ్లీ అమెరికా దాడులు?

- ఒప్పందం కుదరకుంటే సైనిక చర్యకు దిగుతామన్న ట్రంప్

వాషింగ్టన్ : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరాన్‌తో ఒప్పందం కుదరకపోతే మరోసారి సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలివ్వడంతో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఈ వారాంతంలో ఇరాన్‌పై అమెరికా దాడులు చేసే అవకాశాలున్నాయన్న ప్రచారానికి ట్రంప్ వ్యాఖ్యలు మరింత బలం చేకూర్చాయి. మధ్యంతర ఎన్నికల ప్రచారంలో భాగంగా ఫ్లోరిడాలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ పశ్చిమాసియాలో మరోసారి పరిమిత స్థాయిలో 'ఎపిక్ ఫ్యూరీ' సైనిక చర్య జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ వారాంతంలో ఇరాన్‌పై దాడులు జరగవచ్చని తుర్కియేలోని అమెరికా రాయబారి టామ్ బారక్ ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో వ్యాఖ్యానించారు. తొలుత ఈ వ్యాఖ్యలను తోసిపుచ్చిన ట్రంప్.. దాడుల గురించి తనకు తెలియదని పేర్కొన్నారు. అయితే తాజాగా ఆయనే సైనిక చర్యపై సంకేతాలు ఇవ్వడంతో పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ ఉత్కంఠభరితంగా మారాయి. మరోవైపు అమెరికా హెచ్చరికలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమతో నిప్పుతో చెలగాటమాడొద్దని హెచ్చరించింది.

త్రివిధ దళాలకు భారీగా ఆయుధాలు

- రక్షణ కొనుగోళ్లకు రూ.2.12 లక్షల కోట్ల ఆమోదం
- 82 శాతం కొనుగోళ్లు దేశీయ పరిశ్రమల నుంచే
- ఆర్మీ, నేవీ, వైమానిక దళాల సామర్థ్యాల పెంపునకు నిర్ణయం
- డ్రోన్లు, హెలికాప్టర్లు, గగనతల రక్షణ వ్యవస్థల సమీకరణ

న్యూఢిల్లీ: భారత సాయుధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. త్రివిధ దళాల అవసరాల కోసం దాదాపు రూ. 2.12 లక్షల కోట్ల విలువైన రక్షణ పరికరాల కొనుగోలు ప్రతిపాదనలకు రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రతిపాదిత కొనుగోళ్లలో సుమారు 82 శాతం దేశీయ పరిశ్రమల నుంచే చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించారు. భారత సైన్యం కోసం అధిక చలనశీలత కలిగిన వాహనాలు, స్వయంచోదిత ట్రాక్డ్ గన్ వ్యవస్థలు, తుపాకీ కాల్పులను గుర్తించే వ్యవస్థలు, తేలికపాటి బహుళ ప్రయోజన హెలికాప్టర్లు కొనుగోలు చేయనున్నారు. స్వల్ప శ్రేణి గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్లను ఎదుర్కొనే పరికరాలు, నిఘా డ్రోన్లు, సమీకృత నిఘా–దాడి వ్యవస్థలు, దీర్ఘశ్రేణి కామికాజే డ్రోన్ల కొనుగోలుకూ ఆమోదం లభించింది. వీటితో సరిహద్దుల్లో సైనికుల రవాణా సామర్థ్యం, దాడి శక్తి, గగనతల ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యం మెరుగుపడనున్నాయి.



నౌకాదళానికి రక్షణ వ్యవస్థలు

నౌకాదళం కోసం నౌకావ్యతిరేక క్షిపణుల నుంచి రక్షణ కల్పించే యాక్టివ్ ఆఫ్‌బోర్డ్ డికాయ్ వ్యవస్థల కొనుగోలుకు మండలి ఆమోదం తెలిపింది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన నౌకాదళ ప్లాట్‌ఫారమ్‌ల సమీకరణకు కూడా పచ్చ జెండా ఊపింది. వైమానిక దళం కోసం ప్రత్యేక ప్రయోజన హెలికాప్టర్లు, గగనతల రక్షణ వ్యవస్థలు, ఆయుధాలను సమకూర్చుకోనున్నారు. ముందువరుస ప్రాంతాల్లో కచ్చిత మైన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు మొబైల్ ఎక్స్–బ్యాండ్ డాప్లర్ వాతావరణ రాడార్ వ్యవస్థలను కూడా కొనుగోలు చేయనున్నారు.

దేశీయ రక్షణ రంగానికి ఊతం

ఈ కొనుగోళ్లకు సంబంధించిన ప్రతిపాదనలకు డీఏసీ 'అవసరానికి ఆమోదం' (ఏవోఎన్) తెలిపింది. దేశీయ పరిశ్రమలకు ప్రాధాన్యమివ్వడం ద్వారా రక్షణ ఉత్పత్తుల తయారీకి ప్రోత్సాహం లభించడంతోపాటు, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం బలోపేతం కానుందని రక్షణ శాఖ పేర్కొంది.



సిరిసిల్లలో వైభవంగా శ్రీవారి రథోత్సవం

గోవింద నామస్మరణతో మారుమోగిన ఆలయ పురవీధులు

ప్రజానావ, సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఆలయ పురవీధుల్లో సాగిన రథోత్సవం భక్తులకు నేత్రపర్వంగా నిలిచింది. స్వామివారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో రథోత్సవం ప్రశాంతంగా ముగిసింది.

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

ఫిలింనగర్‌లో బీజేపీ నేతల ఘన నివాళులు



ప్రజానావ, ఫిలింనగర్: ఖైరతాబాద్ నియోజకవర్గం ఫిలింనగర్ డివిజన్‌లో మహనీయుల చౌరస్తా వద్ద వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని డివిజన్ వాల్మీకి సంఘం ఆహ్వానం మేరకు బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫిలింనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు బోయ రామాంజనేయులు, డివిజన్ కార్యదర్శి జెరుపెట్టి సైదులు, డివిజన్ కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు, బోయ సంఘం, బీసీ సంఘం నాయకులు బన్నప్ప, జి.వి.ఎస్., దండు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి సేవలు చిరస్మరణీయం

ఫిలింనగర్‌లో కాంగ్రెస్ నేతల ఘన నివాళులు



ప్రజానావ, ఫిలింనగర్: ఫిలింనగర్ డివిజన్‌లోని మహనీయుల చౌరస్తా వద్ద వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాటూరి రమేష్ పాల్గొని మాట్లాడుతూ.. వాల్మీకి మహర్షి సంస్కృత సాహిత్యంలో 24 వేల శ్లోకాలు, ఆరు కాండాలతో కూడిన ఆదికావ్యం శ్రీమద్రామాయణాన్ని రచించిన ఆదికవి, మహాకవి అని కొనియాడారు. తొలుత రత్నాకరుడిగా జీవించిన ఆయన, నారద మహర్షి బోధనతో రామనామ జపం చేస్తూ తపస్సు ద్వారా మహర్షిగా పరివర్తన చెందారని వివరించారు. పుట్ట (వల్మీకం) నుంచి ఉద్భవించడంతో ఆయనకు వాల్మీకి అనే పేరు వచ్చిందన్నారు. క్రౌంచ పక్షుల జంటలో ఒక పక్షి వేటగాడి బాణానికి బలైన దృశ్యాన్ని చూసి చలించిపోయిన వాల్మీకి మహర్షి నోట వెలువడిన శ్లోకం సంస్కృత సాహిత్యంలో తొలి శ్లోకంగా ప్రసిద్ధి చెందిందని తెలిపారు. వాల్మీకి మహర్షి జీవితం సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోయ సాయిలు, బోయ రాములు, బోయ బన్నప్ప, గుంటి వెంకటేశ్ సాగర్, దండు లక్ష్మణ్, ఓర్సు శీను, కృష్ణ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి జ్ఞానప్రకాష్‌కు ఘన నివాళి

సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేత జూటూరు కీర్తిరెడ్డి



ప్రజానావ, హైదరాబాద్: వివాదరహితుడిగా, సౌమ్యుడిగా పేరొందిన కమిడి జ్ఞానప్రకాష్ వంటి మంచి మనిషిని కోల్పోవడం బాధాకరమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జూటూరు కీర్తిరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి, ఆదాయపు పన్ను శాఖ మాజీ కమిషనర్ కమిడి జ్ఞానప్రకాష్ 11వ రోజు సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కీర్తిరెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో పాటు పలువురు ప్రముఖులు, అధికారులు కలిసి జ్ఞానప్రకాష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. జ్ఞానప్రకాష్ ప్రజాసేవలో అందించిన సేవలు, చేసిన కృషి ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

ప్రధానితో గవర్నర్ భేటీ



ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన వివరాలను లోక్‌భవన్ ప్రెస్ సెక్రటరీ విడుదల చేశారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో గవర్నర్ భేటీ

రాష్ట్రపతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన శివ ప్రతాప్ శుక్లా దంపతులు

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తన సతీమణి జానకి శుక్లాతో కలిసి న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి గవర్నర్ పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం రాష్ట్రపతితో గవర్నర్ కొద్దిసేపు భేటీ అయ్యారు.

ప్రజావాణికి అధికారుల గైర్హాజరు

- **ప్రజలకు తప్పని ఎదురుచూపులు**
- **ఉదయం 11.15 గంటలు దాటినా హాజరుకాని వివిధ శాఖల అధికారులు**
- **సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటున్న బాధితులు**



ప్రజానావ, సూర్యాపేట : ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు గైర్హాజరు కావడం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. సోమవారం మఠంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణికి సూపరింటెండెంట్ విజయలక్ష్మి మాత్రమే హాజరైనట్లు స్థానికులు తెలిపారు. ఉదయం 11.15 గంటలు దాటినా ఇతర శాఖల అధికారులు రాకపోవడంతో తమ సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజావాణి ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో వివిధ గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రానికి వస్తున్నారు. అయితే సంబంధిత అధికారులు సమయానికి హాజరుకాకపోవడంతో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహించే కార్యక్రమానికి అధికారులు గైర్హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారులు స్పందించి ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు సమయానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రివిలేజ్ ఫీజు పెంపు వెనక్కి తీసుకోవాలి

బార్లు మూసివేతకు యాజమానుల నిర్ణయం

ప్రజానావ, జమ్మికుంట: బార్ అండ్ రెస్టారెంట్ల ప్రివిలేజ్ ఫీజు పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని అభిరామ్ బార్, ఆదిత్య బార్, రంగు బార్ యాజమానులు కోరారు. పెరిగిన నిర్వహణ ఖర్చులు, వ్యాపారంలో నష్టాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అలాగే పట్టణంలోని కొన్ని వైన్స్‌లలో అక్రమ సిట్టింగ్‌లు, బెల్ట్ షాపులు, నిర్ణీత సమయాలకు మించి మద్యం విక్రయాలపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫీజు పెంపు నిర్ణయం వెనక్కి తీసుకునే వరకు మూడు బార్లను మూసివేయాలని నిర్ణయించినట్లు యాజమానులు వెల్లడించారు. ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రివిలేజ్ ఫీజు పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

కేబీఆర్ పార్కు వద్ద ప్రమాదకరంగా విద్యుత్ పనులు

- **అక్కడక్కడా గోతులు.. రోడ్డుపైనే విద్యుత్ స్తంభాలు**
- **బయటకు తేలిన భూగర్భ కేబుళ్లు**
- **నత్తనడకన ఎలివేటెడ్ కారిడార్ పనులు**
- **ప్రజల భద్రతపై అధికారుల పర్యవేక్షణ కరువు**



ప్రజానావ, హైదరాబాద్ : ప్రజలకు సౌకర్యాలు కల్పించాల్సిన అభివృద్ధి పనులే వారి భద్రతకు ముప్పుగా మారుతున్నాయి. నగరంలోని రద్దీ ప్రాంతమైన కేబీఆర్ పార్కు చౌరస్తా వద్ద ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా చేపట్టిన విద్యుత్ నెట్‌వర్క్ మార్పిడి పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై గోతులు తవ్వి అలాగే వదిలేయడం, విద్యుత్ స్తంభాలను ఇష్టారాజ్యంగా పడేయడం, భూగర్భ కేబుళ్ల బయటకు కనిపించేలా వదిలేయడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు కేబీఆర్ పార్కు వద్ద ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ మాస్టర్ ప్లాన్ విభాగం ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలు, లైన్లు, కేబుళ్లు, ఇతర నెట్‌వర్క్ వ్యవస్థను తరలించే పనులు చేపట్టారు. ఫిలింనగర్, కేబీఆర్ పార్కు జంక్షన్, అగ్రసేన మహారాజా జంక్షన్ తదితర ప్రాంతాల్లో 11 కేవీ, 33 కేవీ విద్యుత్ లైన్లను భూగర్భ కేబుళ్లుగా మార్చేందుకు ప్రణాళిక రూపొందించినప్పటికీ పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. కేబీఆర్ పార్కు చౌరస్తాలో తవ్విన గోతులు కొద్దిరోజులుగా పనులు జరగకపోవడంతో అలాగే ఉండిపోయాయి. కొన్ని చోట్ల భూగర్భ కేబుళ్లు బయటకు తేలి కనిపిస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో కేబుళ్లు వేయడానికి వీలుగా వైర్లను బయటకు తీసి వదిలేశారు. విద్యుత్ స్తంభాలు ఇన్సులేటర్లతో సహా రహదారి పక్కన, రోడ్డుపైనే పడేసి ఉండటంతో వాహనదారులు, పాదచారులకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో గతంలో పనులు చేసినప్పటికీ, ప్రణాళిక లోపాలతో పరిస్థితి గందరగోళంగా మారిందని చెబుతున్నారు. పనులను వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు, ముఖ్యంగా విద్యుత్ సంస్థ సీఎండీ జితేష్ పాటిల్ ఆదేశించినా క్షేత్రస్థాయిలో పురోగతి కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పనులు ఎప్పుడు మొదలవుతాయో, ఎప్పుడు నిలిచిపోతాయో తెలియని పరిస్థితి నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ స్తంభాలను తొలగించిన తర్వాత వాటిని ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై కూడా స్పష్టత లేదని తెలుస్తోంది. కేబుళ్ల కోసం తవ్విన గోతులను సైతం పూడ్చకుండా వదిలేయడంతో ప్రమాదం మరింత పెరుగుతోంది. కొన్ని గోతులను పక్కనే ఉన్న గులకరాళ్లతో హడావిడిగా పూడ్చేందుకు సిబ్బంది ప్రయత్నించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. పనులు వెంటనే పూర్తి చేయాలని క్షేత్రస్థాయి పర్యటనలో జితేష్ పాటిల్ సూచించినప్పటికీ, తవ్విన గోతులను పూడ్చడం, తొలగించిన స్తంభాలను ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశాలపై సర్కిల్, సెక్షన్ స్థాయిలో స్పష్టమైన ఆదేశాలు అందలేదని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు, ఇతర శాఖల నుంచి సహకారం అందడం లేదని కొందరు సిబ్బంది పేర్కొంటుండగా, కార్పొరేట్ కార్యాలయం నుంచి వచ్చే సూచనల ప్రకారమే తాము పనిచేస్తామని, సొంతంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం లేదని సర్కిల్ అధికారులు చెబుతున్నారు. అయితే, పనులు పూర్తయ్యే వరకు రహదారి భద్రతను పర్యవేక్షించడం, ప్రమాదకరంగా ఉన్న గోతులను పూడ్చడం, విద్యుత్ స్తంభాలు, కేబుళ్లను సురక్షితంగా ఉంచడం అత్యవసరమని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించి నిలిచిపోయిన పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు ప్రజలకు ప్రాణాపాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పత్తి చేనులోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- **ప్రయాణికుడికి స్వల్ప గాయాలు**
- **ఐదుగురే ఉండటంతో తప్పిన పెను ప్రమాదం**

ప్రజానావ, కూసుమంచి : హైదరాబాద్ నుంచి భద్రాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు సోమవారం తెల్లవారుజామున కూసుమంచి మండలం లింగారంతండా సమీపంలో అదుపుతప్పి పత్తి చేనులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో సూర్యాపేటకు చెందిన ప్రయాణికుడు సంతోష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో డ్రైవర్‌తో పాటు ఐదుగురు ప్రయాణికులు మాత్రమే ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు అదుపుతప్పడానికి అతివేగమే కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజానావ, భైంసా : భైంసా పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన సాయికిరణ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కూరగాయల పంపిణీ కోసం వెళ్లిన ఆయన భైంసా మండలంలోని మాంజ్రి సమీపంలో ప్రమాదానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఎలివేటెడ్ కారిడార్ పరిహారంలో వసూళ్ల ఆరోపణలు

- **రూ.6 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులు**
- **భూసేకరణ అధికారినిపై ప్రాథమిక ఆధారాలు సేకరిస్తున్న రెవెన్యూ ఉన్నతాధికారులు**



ప్రజానావ, హైదరాబాద్ : ప్యారడైజ్ కూడలి నుంచి శామీర్‌పేట వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణ పరిహారం పంపిణీలో వసూళ్ల వ్యవహారం కలకలం రేపుతోంది. భూములు, ఆస్తులు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం విడతలవారీగా రూ.400 కోట్లు విడుదల చేయగా, చెక్కులు అందించేందుకు కొందరి నుంచి రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ కలెక్టరేట్‌లోని భూసేకరణ విభాగానికి చెందిన ఓ అధికారిని పరిహారం పొందాల్సిన బాధితులతో ఫోన్‌లో మాట్లాడి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పేర్లలో తప్పులున్నా, కొంతకాలంగా ఇంట్లో ఉండకపోయినా పరిహారం ఇప్పించామని, ముందు గా డబ్బులు చెల్లిస్తేనే చెక్కులు ఇస్తామని ఆమె చెప్పినట్లు బాధితులు పేర్కొంటు న్నారు. ఈ వసూళ్ల కోసం సిద్ధూ అనే ప్రైవేటు వ్యక్తిని మధ్యవర్తిగా ఉపయోగించుకుంటున్నారనే ఆరోపణ లు వినిపిస్తున్నాయి.

రూ.6 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వసూళ్లు?

పరిహారం మంజూరైన భూ నిర్వాసితుల నుంచి రూ.6 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. తిరుమలగిరి మండలానికి చెందిన ఓ వ్యక్తి నుంచి నెల క్రితం రూ.6 లక్షలు తీసుకున్నారని, బోయిన్‌పల్లికి చెందిన మరో వ్యక్తి నుంచి సిద్ధూ రూ.14 లక్షలు తీసుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. అయినప్పటికీ చెక్కులు అందకపోవడంతో బాధితులు కలెక్టరేట్‌కు వెళ్లి అధికారినిని సంప్రదించారు. వరుస సెలవులు, ఉన్నతాధికారులు ఇతర పనుల్లో బిజీగా ఉన్నారంటూ తొలుత జాప్యం చేసినట్లు సమాచారం. ఈ నెల 19న చెక్కులు ఇస్తామని చెప్పడంతో కార్యాలయానికి వెళ్లిన బాధితులను, తనకు ఏమైనా బాకీ ఉన్నారా? అంటూ అధికారిణి వెనక్కి పంపించినట్లు ఆరోపిస్తున్నారు. దీంతో బాధితులు కలెక్టరేట్‌కు వచ్చి ఉన్నతాధికారుల దృష్టికి వ్యవహారాన్ని తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ వసూళ్ల ఆరోపణలపై రెవెన్యూ ఉన్నతాధికారులు ప్రాథమిక ఆధారాలు సేకరిస్తున్నట్లు ఓ అధికారి ధ్రువీకరించినట్లు సమాచారం.

టీడీఆర్ బాండ్లకు నిరాకరణతో నగదు పరిహారం

సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ కూడలి నుంచి శామీర్‌పేట వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ కోసం ప్రైవేటు ఆస్తులు, భూములను సేకరించారు. నిర్వాసితులకు పరిహారంగా బదిలీ చేయగల అభివృద్ధి హక్కుల (టీడీఆర్) బాండ్లు ఇస్తామని అధికారులు ప్రతిపాదించగా, భూయజమానులు వాటిని తిరస్కరించి నగదు పరిహారం కోరారు. దీంతో ప్రాంతాలను బట్టి చదరపు గజానికి రూ.90 వేల నుంచి రూ.1.13 లక్షల వరకు పరిహారం నిర్ణయించి, కలెక్టరేట్ ద్వారా చెక్కులు అందించాలని నిర్ణయిం చారు. అయితే చెక్కులు జారీ చేసే సమయంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

బైకులు మీవే.. అప్పులు మీవే.. దండా మాత్రం ముఠాలదే

- **రుణాల పేరుతో వాహనాలు తీసుకుని తక్కువ ధరకు విక్రయం**
- **నగరంలో ఎనిమిది నెలల్లో 20కి పైగా కేసులు**
- **సోషల్ మీడియా ప్రకటనలతో వల**
- **వాహనాల స్వాధీనం, బీమా సొమ్ము కోసం కొత్త ఎత్తుగడలు**



ప్రజానావ, హైదరాబాద్ : బైకు కొనుగోలు కోసం రుణం తీసుకున్న ఓ ప్రైవేటు ఉద్యోగి ఆర్థిక ఇబ్బందులతో వాయిదాలు చెల్లించలేకపోయాడు. దీంతో ఫైనాన్షియర్ ఏజెంట్లు అతడిపై ఒత్తిడి తెచ్చి, తాము సూచించిన వ్యక్తికి వాహనాన్ని విక్రయించాలని బలవంతం చేశారు. గత్యంతరం లేక బైకును వారికి అప్పగించినా, ఫైనాన్షియర్ నుంచి బకాయిల చెల్లింపుపై ఒత్తిడి తగ్గలేదు. వాహనం పోవడం తోపాటు రుణభారం కూడా అలాగే ఉండటంతో తాను రెండు విధాలుగా మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. నగరంలో కొందరు ముఠాలుగా ఏర్పడి ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. రుణాలు ఇప్పిస్తామని నమ్మించి వ్యక్తిగత పత్రాలు సేకరించడం, బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల ద్వారా బాధితుల పేర్లపై బైకులు, కార్లు, ఆటోలు, ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేయించడం, వాటి వాయిదాలను తామే చెల్లిస్తామని నమ్మించడం ఈ ముఠాల పద్ధతిగా మారింది. మొదట రెండు మూడు నెలలు వాయిదాలు చెల్లించి నమ్మకం కలిగించిన తర్వాత అసలు దందాకు తెరతీస్తున్నారు. వాహనాలను తక్కువ ధరకు ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో వాహనాలు కోల్పోయిన బాధితుల పేర్లపై రుణాలు మాత్రం అలాగే ఉండటంతో వారు ఫైనాన్స్ సంస్థల నుంచి నోటీసులు ఎదుర్కోవాల్సి వస్తోంది. నగరంలో గత ఎనిమిది నెలల్లో ఈ తరహా కేసులు 20కి పైగా నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. వీటిలో ఎక్కువ ఘటనలు పాతబస్తీ ప్రాంతంలో చోటుచేసుకుంటున్నట్లు గుర్తించారు. గతంలో ఇలాంటి మోసాలకు పాల్పడిన ఓ ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని, వారి నుంచి 30 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరుగుతుండటంతో ముఠాలు అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

వాయిదాలు కట్టలేదని వాహనాలు స్వాధీనం..

ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు కొనుగోలు చేసేందుకు రుణాలు తీసుకుని వాయిదాలు సక్రమంగా చెల్లించని వారిని ఏజెంట్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు. బకాయిలు చెల్లించకపోతే వాహనాన్ని తీసుకెళ్తామని బెదిరించి, ఫైనాన్స్ సంస్థకు అప్పగించాల్సిన వాహనాలను సెకండ్‌హ్యాండ్ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా రుణ బకాయిలు రద్దు చేయిస్తామని నమ్మించి, వాహనం చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేయిస్తున్న ఘటనలూ వెలుగుచూశాయి. కేసు నమోదైన తర్వాత బీమా సంస్థలకు దరఖాస్తు చేసి పరిహారం పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలతో వల..

కార్లు, బైకులు తక్కువ ధరకు ఇప్పిస్తామంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు పెట్టి కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారు. ప్రకటనలకు స్పందించిన వారిని వాయిదాలు చెల్లించలేని వాహన యజమానుల వద్దకు తీసుకెళ్లి, వాహనం కొనుగోలు చేస్తే కేసులు, రుణ బకాయిల సమస్యలు ఉండవని భరోసా ఇస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న యజమానులు ఈ మాటలు నమ్మి వాహనాలను అప్పగిస్తున్నారు. నగదు తీసుకున్న తర్వాత మధ్యవర్తులు ముఖం చాటేస్తుండటంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కొందరు పోలీసులను ఆశ్రయిస్తే తమపై మరిన్ని కేసులు నమోదవుతాయేమోనన్న భయంతో ఫిర్యాదు చేసేందుకు వెనుకాడుతున్నట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు. వాహనం లేక, మరోవైపు ఫైనాన్స్ సంస్థల నుంచి నోటీసులు అందుకుంటూ తాము రెండు విధాలుగా నష్టపోతున్నామని బాధితులు వాపోతున్నారు.



రుద్రారంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,461 మద్దతు ధర
- సన్న వడ్లకు బోనస్‌తో కలిపి రూ.2,961

ప్రజానావ, పటాన్‌చెరు : ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రుద్రారం, లక్ష్మారం వార్డుల రైతుల కోసం రైతు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రుద్రారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్ శివన్న, డైరెక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సీఈవో దండు రాజు, స్థానిక కౌన్సిలర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీవీ మనోరమ్మ, ఏవో శివకుమార్, ఏఈవో మౌనిక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461, సాధారణ రకం ధాన్యానికి రూ.2,441 మద్దతు ధర అందిస్తారని తెలిపారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.2,461 మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ కలిపి మొత్తం రూ.2,961 చెల్లిస్తారని వివరించారు. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు, సాగునీటి లభ్యతపై అనిశ్చితి నెలకొనే అవకాశం ఉన్నందున రైతులు పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, వరికి బదులుగా జొన్న, కుసుమ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం ప్రతినిధులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కేసీఆర్ కోసం చెప్పులు లేకుండా పాదయాత్ర

- గూరకొండ నుంచి గజ్వేల్‌కు చిన్న నరసింహ ప్రయాణం
- దేవరకద్రలో ఘన స్వాగతం



ప్రజానావ, దేవరకద్ర : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అభిమానంతో, 2028లో ఆయన మరోసారి తెలంగాణ ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతో మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం గూరకొండ గ్రామానికి చెందిన యువ నాయకుడు చిన్న నరసింహ చెప్పులు లేకుండా పాదయాత్ర ప్రారంభించారు. సోమవారం స్వగ్రామం గూరకొండ నుంచి గజ్వేల్‌లోని కేసీఆర్ నివాసం వరకు పాదయాత్రగా బయలుదేరారు. దేవరకద్రకు చేరుకున్న ఆయనకు మున్సిపాలిటీ 11వ వార్డు కౌన్సిలర్ వడ్డె రాధా కొండల్ స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన చిన్న నరసింహతో కలిసి కొంతదూరం పాదయాత్రలో పాల్గొన్నారు. ఆ తర్వాత చిన్న నరసింహ గజ్వేల్ వైపు తన పాదయాత్రను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు అడ్డూ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

సందీప్‌రెడ్డి నిశ్చితార్థానికి ఆహ్వానం



ప్రజానావ, సంగారెడ్డి : భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావును పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోమవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించనున్న తన సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి కుమారుడు సందీప్‌రెడ్డి నిశ్చితార్థ వేడుకకు హాజరు కావాలని కేటీఆర్‌ను ఆహ్వానించారు. అనంతరం విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని కేటీఆర్‌కు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

వాల్మీకి మహర్షి జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం

ధర్మం, సత్యం, మానవతా విలువలను చాటిచెప్పిన మహనీయుడు : మంత్రి వాకిటి శ్రీహరి



ప్రజానావ, మక్తల్ : వాల్మీకి మహర్షి జీవితం, ఆయన బోధనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని రాష్ట్ర క్రీడలు, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ పట్టణంలో నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాహిత్య చరిత్రలో వాల్మీకి మహర్షికి విశిష్ట స్థానం ఉందన్నారు. రామాయణ మహాకావ్యాన్ని రచించి ప్రపంచానికి ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువలను చాటిచెప్పిన మహనీయుడని కొనియాడారు. ఆయన రచించిన రామాయణం తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తూ నైతిక విలువలను బోధిస్తోందని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతి, సమానత్వం, సామాజిక ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వాల్మీకి సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి ఒడిలో పులిగుండాల

జలసోయగం

- పచ్చని అడవులు.. ఆకాశాన్నంటే గుట్టలు
- కనువిందు చేస్తున్న జలరాశి

ప్రజానావ, ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లా పెనుబల్లి, చంద్రుగొండ మండలాల పరిధిలోని కనకగిరి గుట్టల మధ్య ప్రకృతి ఒడిలో కొలువుదీరిన పులిగుండాల ప్రాజెక్టు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. చుట్టూ పచ్చని అడవులు, ఆకాశాన్ని తాకుతున్నాయా అన్నట్లుగా కనిపించే కొండలు, వాటి నడుమ నిశ్శబ్దంగా పరచుకున్న జలరాశి పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. నిర్మలమైన నీటిలో ప్రతిబింబించే గుట్టలు అద్దంలో కనిపించే దృశ్యాలను తలపిస్తూ ప్రకృతి ప్రేమికులను మరో లోకంలోకి తీసుకెళ్తున్నాయి. పచ్చని వనాల మధ్య విరాజిల్లుతున్న ఈ జలసోయగం మనసుకు ఆహ్లాదాన్ని పంచుతూ, ప్రశాంతమైన వాతావరణంతో సందర్శకులను ఆకట్టుకుంటోంది. ప్రకృతి అందాలను ఆస్వాదించాలనుకునేవారికి పులిగుండాల ఓ అందమైన విడిదిగా నిలుస్తోంది. నిత్యం ఉరుకుల పరుగుల జీవితంలో కొంతసేపు ప్రశాంతంగా గడపాలనుకునేవారికి ఇక్కడి పచ్చదనం, కొండల అందాలు, జలరాశి ఆహ్లాదకరమైన అనుభూతిని అందిస్తాయి. ప్రకృతి అందాలను ఆస్వాదించడంతోపాటు వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యతను కూడా పులిగుండాల పరిసరాలు గుర్తుచేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ఈ సహజసిద్ధమైన అందాలను భావితరాలకు అందించాల్సిన అవసరాన్ని చాటుతున్నాయి.

నాలుగు వరుసల రహదారి

ఆక్రమణలతో మళ్లీ ఇరుకు

- దేవరకొండలో ఫుట్‌పాత్‌లపై చిరువ్యాపారాలు
- అస్తవ్యస్త పార్కింగ్‌తో ట్రాఫిక్ కష్టాలు
- ఆరు నెలల్లో ఎనిమిది మంది మృతి



ప్రజానావ, దేవరకొండ : కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారి (167) నాలుగు వరుసలుగా విస్తరించినా ఆక్రమణలు, అస్తవ్యస్త పార్కింగ్‌తో మళ్లీ ఇరుకుగా మారుతోంది. ఫుట్‌పాత్‌లను వ్యాపార కార్యకలాపాలకు వినియోగిస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రధాన రహదారిపైనే వాహనాలు సాఫీగా వెళ్లలేని పరిస్థితి నెలకొనగా, యూటర్న్‌లు ప్రమాదకరంగా మారుతున్నాయి. గత ఆరు నెలల్లో యూటర్న్‌ల వద్ద ఎనిమిది మంది మృత్యువాతపడటం ఆందోళన కలిగిస్తోంది. దేవరకొండ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఫుట్‌పాత్‌పై చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలపడంతో రహదారి ఇరుకుగా మారుతోంది. దీంతో బస్టాండ్ నుంచి బస్సుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్థానిక ఐబీ మూలమలుపు వద్ద వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. ఫుట్‌పాత్‌పై తోపుడు బండ్లు, దుకాణాలు ఏర్పాటు చేయడంతోపాటు సమీపంలో అతిథిగృహం, ఎంపీడీవో కార్యాలయం, కూరగాయల మార్కెట్ ఉండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతోంది. మీనాక్షి చౌరస్తా వద్ద ఆటో మెకానిక్‌లు, ఆటోమొబైల్ దుకాణాల యజమానులు పాత వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో రాత్రివేళల్లో భారీ వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. విష్ణు కాంప్లెక్స్, చేనేత సహకార సంఘం భవనాల ఎదుట ద్విచక్రవాహన నాలను అడ్డదిడ్డంగా నిలపడంతో రహదారి కుంచించుకుపోతోంది. విష్ణు కాంప్లెక్స్‌లో సుమారు వంద వాణిజ్య దుకాణాలు, చేనేత సహకార సంఘం భవనంలో దాదాపు 30 దుకాణాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో వచ్చే వినియోగదారులు రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. సీపీఐ కార్యాలయానికి వెళ్లే మూలమలుపు వద్ద కూడా వాహనాలు, తోపుడు బండ్లు అడ్డంగా ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీంతో ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేటు వాహనాలు, కర్నూలు, మహబూబ్‌నగర్, మద్దిమడుగు, శ్రీశైలం వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు దేవరకొండ పురపరిధిలో జాతీయ రహదారిపై ఉన్న ఫుట్‌పాత్ లను కొందరు వ్యాపారులు అద్దెకు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. దుకాణాల ఎదుట చిరు వ్యాపారాలు, హోటళ్లు, జ్యూస్ బండ్లు ఏర్పాటు చేసు కోవడం, ఇందుకోసం అద్దె చెల్లించడం పరిపాటిగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించి, రహదారిపై అక్రమ పార్కిం గ్‌ను నియంత్రించాలని, ప్రమాదకర యూటర్న్‌ల వద్ద భద్రతా చర్యలు చేపట్టి వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వెలుగుమట్ల గుట్టల్లో ఖనిజం కొల్లగొట్టిన ఘనులెవరు?

- బెరైటీస్ అక్రమ తవ్వకాలపై తేలని నిందితుల ఆచూకీ
- విచారణలో అధికారుల జాప్యం



ప్రజానావ, ఖమ్మం : జిల్లాలోని భూగర్భ ఖనిజ సంపద అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. కొన్నేళ్లుగా గుట్టలను తవ్వి ఎర్రమట్టి, మొరం అక్రమంగా తరలిస్తుండగా, తాజాగా ఖనిజాల కోసం రాళ్లను జిల్లెడపదుతూ అక్రమంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఖమ్మం నగర శివారులోని వెలుగుమట్ల గుట్టల్లో బెరైటీస్ ఖనిజాన్ని కొల్లగొట్టిన ఘటన చర్చనీయాంశంగా మారింది. ఈ అక్రమ దందాపై 'ఈనాడు'లో కథనం ప్రచురితమైనా ఇరవై రోజులు దాటుతున్నా నిందితులెవరో తేలకపోవడం అధికారుల తీరుపై విమర్శలకు తావిస్తోంది. బెరైటీస్ ఖనిజానికి అధిక సాంద్రత ఉండటంతో పెట్రోలియం, సహజవాయువు వెలికితీతలో డ్రిల్లింగ్ సమయంలో బరువు కారకంగా ఉపయోగిస్తారు. భూగర్భంలో ఒత్తిడిని సమతుల్యం చేయడంతోపాటు ప్రమాదకరమైన పేలుడు ఉద్ధృతులను నిరోధించడంలో ఇది తోడ్పడుతుంది. ఎక్స్‌రే పరికరాలతోపాటు రంగులు, ప్రైమర్లు, కాగితం, రబ్బరు, ప్లాస్టిక్ తయారీలోనూ వినియోగిస్తుండటంతో దీనికి మార్కెట్‌లో డిమాండ్ ఉంది. జిల్లాలోని కారేపల్లి, చింతకాని మండలాల్లో బెరైటీస్ నిక్షేపాలు విస్తారంగా ఉండటంతో గనులను లీజుకు ఇచ్చారు. అయితే ఖమ్మం వెలుగుమట్ల గుట్టలపై ఏర్పాటుచేసిన వెంచర్లలో కొంతకాలంగా అక్రమ తవ్వకాలు జరిపి బెరైటీస్ ముడి ఖనిజ రాళ్లను తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రైవేటు భూముల్లో ఖనిజాల తవ్వకాలు చేపట్టాలంటే గనుల శాఖకు సీనరేజీ చెల్లించాల్సి ఉంటుంది. కానీ గుట్టలపై పర్యవేక్షణ కొరవడటంతో అక్రమార్కులు రాత్రివేళల్లో తవ్వకాలు జరిపి రాళ్లను సేకరించి, వాటిని వేరు చేసి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. కలెక్టర్ దివాకర్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి గుంతలను కొలిచి, ఎంతమేర ఖనిజం తరలించారో అంచనా వేశారు. అయితే నిందితులెవరు, ఖనిజాన్ని ఎక్కడికి తరలించారు అనే అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ జరపకుండానే ఇద్దరు వెంచర్ పట్టాదారులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. స్థానికంగా నివసించని వారిని విచారించడంలో పోలీసులు జాప్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి. చింతకాని మండలం కొదుమూరు, ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట పరిసర ప్రాంతాలకు చెందిన కొందరు వెలుగుమట్లలో అక్రమ తవ్వకాలు జరిపినట్లు సమాచారం. సేకరించిన ఖనిజ రాళ్లను స్థానికంగా నిల్వ చేసి, కోదాడ మీదుగా ఆంధ్రప్రదేశ్‌కు తరలించి విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. విలువైన ఖనిజ సంపద అక్రమంగా తరలిపోతున్న నేపథ్యంలో గనుల శాఖ, పోలీసు అధికారులు సమగ్ర విచారణ జరిపి నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పెరిగిన ప్రివిలేజ్ ట్యాక్స్‌కు నిరసనగా బార్లు బంద్

- పెంచిన పన్నును తగ్గించాలని బార్ యజమానుల డిమాండ్

ప్రజానావ, సూర్యాపేట : బార్ అండ్ రెస్టారెంట్లపై రాష్ట్ర ప్రభుత్వం ప్రివిలేజ్ ట్యాక్స్ పెంచడాన్ని నిరసిస్తూ రాష్ట్ర బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం జిల్లాలో బార్ల బంద్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి బార్లు మూతపడ్డాయి. ఈ సందర్భంగా జిల్లా బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ నాయకులు గవ్వ కృష్ణారెడ్డి, రంగరాజు రుక్మారావు మాట్లాడుతూ బార్ అండ్ రెస్టారెంట్ల విషయంలో ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. పన్నులు పెంచడం వల్ల బార్ యజమానులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే పెంచిన ప్రివిలేజ్ ట్యాక్స్‌ను తగ్గించి బార్ యజమానులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో బార్ యాజమాన్య ప్రతినిధులు మోదుగు కృష్ణారెడ్డి, కె. హరిప్రసాద్, మండాది శ్రీనివాస్, రాపర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- అనుమతి ఒక్కరోజు.. మట్టి తరలింపు వందల ట్రిప్పులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి, వ్యవసాయ భూములకు ముప్పు



ప్రజానావ, చిట్యాల : ప్రభుత్వ, వ్యవసాయ పట్టాభూముల నుంచి మట్టి తరలింపు విషయంలో నిబంధనలు అమలుకు నోచుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకొని కొందరు అక్రమంగా మట్టి తరలిస్తూ ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్నారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ అనుమతులు, మట్టి తరలింపులో పాటించాల్సిన నిబంధనలను పక్కనబెట్టి చిట్యాల మండలం ఆరెగూడెం, పెద్దకాపర్తి, వెలిమి నేదు ప్రాంతాల్లో పలుచోట్ల తవ్వకాలు చేపడుతు న్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆరెగూడెంలో ఓ రైతుకు చెందిన పట్టాభూమిని చదును చేసే పేరుతో భారీ టిప్పర్లు, మట్టి తవ్వే యంత్రాలను ఉపయో గించి వందల ట్రిప్పుల మట్టిని తరలించినట్లు ఆరోప ణలున్నాయి. సదరు రైతు మైనింగ్ శాఖకు చేసుకున్న దరఖాస్తు మేరకు ఒక్కరోజు, నిర్దేశిత పరిమితికి లోబడి మాత్రమే మట్టి తరలించేందుకు అనుమతి ఇచ్చినట్లు తహసీల్దారు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. అయితే ఆ అనుమతిని అడ్డుపెట్టుకొని నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు అవసరాల కోసం పెద్దమొత్తంలో మట్టి తరలించినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంపై గ్రామస్థులు మండలస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు క్షేత్రస్థాయికి వచ్చిన రెవెన్యూ సిబ్బంది మట్టి తరలింపును నిలిపివేయాలని సదరు రైతుకు సూచించి వెళ్లినట్లు తెలుస్తోంది. అయితే వాస్తవంగా ఎంత మట్టిని తరలించారు? ఎంత పరిమాణానికి అనుమతి ఉంది? నిబంధనలు ఉల్లంఘించిన వారెవరు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వడంతోపాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మరోవైపు వ్యవసాయ భూముల్లో పైపొర మట్టిని ఇష్టారీతిన తవ్వడం వల్ల భూసారం తగ్గి భవిష్యత్తులో పంటల సాగు కష్టతరమయ్యే ప్రమాదం ఉంది. మట్టి తవ్వకాలతో భూగర్భ జలమట్టాలపైనా ప్రభావం పడే అవకాశం ఉంది. భారీ టిప్పర్లు, లారీల ద్వారా మట్టి తరలించడంతో గ్రామీణ రహదారులు దెబ్బతినడమే కాకుండా దుమ్ము, ధూళితో కాలుష్యం పెరుగుతోంది. వాహనాలు వేగంగా ప్రయాణించడం వల్ల రోడ్డు ప్రమాదాల ముప్పు కూడా పొంచి ఉంది. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి అనుమతుల మేరకే మట్టి తరలించేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బడిబస్సులకేనా ఫిట్‌నెస్.. మిగతా వాటికి వర్తిచవా?

- ఆటోలు, వ్యాన్లలో చిన్నారుల ప్రయాణం ప్రమాదకరం
- నిబంధనలు పాటించని వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థుల తరలింపు
- తనిఖీలు చేపట్టాలనే డిమాండ్



ప్రజానావ, ఖమ్మం : జిల్లాలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో వందల సంఖ్యలో ఆటోలు, వ్యాన్లు, క్యాబ్‌లు, మినీవ్యాన్ల ద్వారా విద్యార్థులను తరలిస్తున్నా వాటి భద్రతపై పర్యవేక్షణ కొరవడింది. బడిబస్సులకు ఏటా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్న రవాణా శాఖ అధికారులు ఇతర వాహనాల తనిఖీలను పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. దీంతో కొందరు డ్రైవర్లు పరిమితికి మించి చిన్నారులను ఎక్కిస్తూ వారి ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. ఇటీవల ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు విద్యా సంస్థను సందర్శించిన రవాణా శాఖ అధికారులు అక్కడ సుమారు రెండు వేల మంది విద్యార్థులు ఉండగా, కొద్దిమంది మాత్రమే బడి బస్సుల్లో వస్తున్నట్లు గుర్తించారు. బస్సుల నిర్వహణ సంతృప్తికరంగా ఉన్నప్పటికీ చాలామంది విద్యార్థులు సరైన భద్రతా ప్రమాణాలు పాటించని ఆటోలు, వ్యాన్లలో వస్తున్నట్లు గమనించారు. నిబంధనల ప్రకారం ఆటోల్లో నిర్ణీత సీటింగ్ సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదు. అయినప్పటికీ కొందరు డ్రైవర్లు పరిమితికి మించి విద్యార్థులను కుక్కి, ఒకరిపై మరొకరిని కూర్చోబెడుతున్నారు. పుస్తకాల సంచులు అదనం కావడంతో చిన్నారులు ఇరుకైన ప్రదేశాల్లో ఉక్కపోత మధ్య ప్రయాణిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బడిబస్సుల ఖర్చు ఎక్కువగా ఉంటుందనే కారణంతో కొందరు తల్లిదండ్రులు ఆటోలు, వ్యాన్లను ఆశ్రయిస్తున్నారు. అయితే కిటికీలు, ద్వారాల నుంచి పిల్లలు బయటకు పడిపోకుండా, చేతులు బయటకు పెట్టకుండా రక్షణ గ్రిల్స్, కడ్డీలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా చాలా వాహనాల్లో అవి కనిపించడం లేదు. పాత ఆటోలు, వ్యాన్లలో తలుపులు సరిగ్గా లాక్ అయ్యే వ్యవస్థ లేకపోవ డంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉంది. కొన్ని వాహనాల్లో ఒకవైపు మాత్రమే కడ్డీ ఏర్పాటు చేసి నడుపుతుండగా, చిన్నారులు వాటిపై కూర్చుంటున్నారు. వాహనాలపై 'పాఠశాల విద్యార్థుల ఆటో, వ్యాను' అనే గుర్తింపు రాతలు కూడా చాలాచోట్ల కనిపించడం లేదు. డ్రైవర్లు అనుభవ జ్ఞులా? సరైన డ్రైవింగ్ లైసెన్స్ ఉందా? అనే అంశాలపై కూడా తనిఖీలు జరగడం లేదనే ఆరోపణలున్నాయి. ఇటీవల పలుచోట్ల ఆటోలు ప్రమాదాలకు గురై విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడిన ఘటనలు ఈ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. విద్యార్థులను తరలించే వ్యాన్లు, క్యాబ్‌లకు రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, చెల్లుబాటులో ఉన్న బీమా పత్రం, కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రం, రవాణా అనుమతి పత్రం తప్పనిసరిగా ఉండాలి. డ్రైవర్‌కు చెల్లుబాటులో ఉన్న డ్రైవింగ్ లైసెన్స్ కూడా ఉండాలి. సంబంధిత అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై చర్యలు తీసుకోవడంతోపాటు విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.




బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

- కార్యక్రమంలో 21 ఫిర్యాదులు స్వీకరణ
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

ప్రజానావ, సిరిసిల్ల : ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 21 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

ప్రజావాణితో సమస్యల పరిష్కారానికి చర్యలు

163 అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



ప్రజానావ, సిరిసిల్ల: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించే అర్జీలను సంబంధిత అధికారులు పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 163 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో నాలుగు, వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో ఐదు దరఖాస్తులు వచ్చాయి. ఆయా దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.

మండలాల వారీగా అర్జీలు

బోయినపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో నాలుగు, ఇల్లంతకుంట మండలంలో ఆరు, గంభీరావుపేటలో రెండు, కోనరావుపేటలో మూడు, ముస్తాబాద్‌లో ఆరు, తంగళ్లపల్లిలో ఒకటి, వీర్నపల్లిలో ఒకటి, వేములవాడ అర్బన్‌లో మూడు, వేములవాడ రూరల్‌లో మూడు, ఎల్లారెడ్డిపేట ఎంపీడీఓ కార్యాలయంలో రెండు దరఖాస్తులు అందాయి. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల పి.లక్ష్మణాచారి



ప్రజానావ, సిరిసిల్ల : బాలల రక్షణ బాలలపై లైంగిక నేరాలను నిరోధించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల పి.లక్ష్మణాచారి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ స్కూల్, సిరిసిల్ల లో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, సూచనలతో బాలల హక్కులపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా "సురక్షిత్ బచ్పన్ అభియాన్" పేరుతో జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న పాఠశాల స్థాయి అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ పిల్లలకు తమ హక్కుల గురించి, మంచి స్పర్శ – చెడు స్పర్శ గురించి, అపరిచితులు లేదా తెలిసిన వ్యక్తుల నుంచి ఎదురయ్యే ప్రమాదాల గురించి వయస్సుకు తగిన రీతిలో అవగాహన కల్పించడం ఎంతో అవసరమని తెలిపారు. పోక్సో చట్టంలోని నిబంధనలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పాఠశాలలు విద్యాబోధనకు మాత్రమే పరిమితం కాకుండా, పిల్లల భద్రతకు కూడా అత్యంత ప్రాధాన్యత ఇవ్వా లని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.సుష్మిత, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, న్యాయవాదులు పెంట శ్రీనివాస్, ఆడెపు వేణు, కళ్యాణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

ప్రజానావ, వేములవాడ : వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తలనీలాలు సమర్పించి, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అభిషేకాలు, అన్నపూజ, నిత్యకళ్యాణం, చండీహోమం తదితర పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చేపట్టిన ఏర్పాట్లను ఆలయ డీఈఓ ప్రతాప నవీన్ కుమార్ పరిశీలించారు. దర్శన క్యూలైన్లు, కోడె చెక్‌పోస్టు, కోడెలు కట్టే ప్రదేశాలను పర్యవేక్షించి, దర్శనాలు ప్రశాంతంగా జరిగేలా సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ శర్మ, ఉద్యోగులు, ఎస్పీఎఫ్ భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రజానావ, సిరిసిల్ల: తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుకుంటూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన బ్రహ్మోత్సవాల రథోత్సవంలో ఆది శ్రీనివాస్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు, పూజలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తాయని అన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలకు శాంతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు.

హామీల అమలు కోరుతూ సీఎం ఇంటి ముట్టడికి పిలుపు

ఉద్యమకారుల అరెస్టు

ప్రజానావ, బాన్సువాడ : తెలంగాణ ఉద్యమకారులను తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేశారు. తమకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని నిరసన వ్యక్తం చేస్తూ సీఎం ఇంటి ముట్టడికి ఉద్యమకారుల నాయకులు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ అరెస్టులు చోటుచే సుకున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యమకారులకు అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల పింఛను, గుర్తింపు కార్డులు ఇస్తామని హామీ ఇచ్చిందని ఉద్యమకారు లు పేర్కొన్నారు. ఇదుకోసం కేకే కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకో కుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు ఆగ్ర హం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బాలల భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

- పోక్సో చట్టంపై విద్యార్థులకు సీనియర్ సివిల్ జడ్జి పి. రవీందర్ అవగాహన



ప్రజానావ, నిర్మల్ : బాలల భద్రత, పోక్సో చట్టం, సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పి. రవీందర్ సూచించారు. కడెం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సురక్షిత్ బచ్పాన్ అభియాన్' కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సమాజంలో బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఉందని, మైనర్లపై జరిగే అకృత్యాలను అరికట్టేందుకు ఉన్న పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తెలిపారు. చట్టాల గురించి తెలుసుకోవడం ద్వారా తమను తాము రక్షించుకోవడంతోపాటు సమాజంలో నేరాలను అడ్డుకోవచ్చని పేర్కొన్నారు. పెరుగుతున్న సాంకేతికతతో పాటు సైబర్ నేరాల ముప్పు కూడా పెరుగుతోందని, సామాజిక మాధ్యమాలు, అంతర్జాల వేదికలను ఉపయోగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైనా, ఆన్‌లైన్ మోసాల బారిన పడినా ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. బాలికలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమకు ఎదురయ్యే సమస్యలను ఉపాధ్యాయులకు లేదా సంబంధిత చట్టపరమైన సంస్థలకు తెలియజేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



రైతుల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- రైతుల సమస్యల పరిష్కారంలో సింగిల్ విండోలు కీలకం:
- విప్ ఆది శ్రీనివాస్

ప్రజానావ, కోనరావుపేట: రైతుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం కోనరావుపేట మండలం కొలనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్, పాలకవర్గ సభ్యుల అభినందన సభలో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు ఎరువులు, వ్యవసాయ వనరులు అందుబాటులో ఉంచడంతో పాటు, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో సింగిల్ విండోలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 లక్షల మంది రైతులకు రూ.20,650 కోట్లతో రుణమాఫీ చేసినట్లు వివరించారు. అనంతరం మరిమడ్ల గ్రామంలో నూతన అంగన్వాడీ భవనాన్ని ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొమ్మన భాస్కరరావు, చేపూరి గంగాధర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు మానుక సత్యం, జిల్లా నాయకులు షేక్ ఫిరోజ్ పాషా, సర్పంచులు జలగం అరవింద్ రావు, కోల స్వాతి శ్రీనివాస్, ఉప సర్పంచ్ శేఖర్, పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి రూ.30 లక్షల విలువైన వైద్య పరికరాలు

- కేటీఆర్ చొరవతో సీఎస్ఆర్ నిధుల ద్వారా సమకూర్చిన పరికరాలు ప్రారంభం..
- రోగులకు అందుబాటులోకి తెచ్చిన కేటీఆర్



ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ ఆర్) నిధుల ద్వారా దాదాపు రూ.30 లక్షల విలువైన వైద్య పరికరాలు సమకూరాయి. సోమవారం కేటీఆర్ ఈ పరికరాలను ప్రారంభించి రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కేటీఆర్ ఈ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బం దుల కారణంగా ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించలేని పేదలకు ప్రభుత్వ ఆసుప త్రుల్లోనే మెరుగైన వైద్య సదుపాయాలు అం దుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో ఈ పరిక రాలను సమకూర్చేందుకు కృషి చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సదుపాయాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ, గతంలో కల్పించిన సదుపాయాల పరిరక్షణపై నిర్ల క్ష్యం చూపుతోంది. ఈ నేపథ్యంలో ఆసు త్రికి వచ్చే రోగుల అవసరాలను గుర్తించి, సీఎస్ఆర్ నిధుల ద్వారా సుమారు రూ.30 లక్షల విలువైన వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావడం ప్రాధా న్యత సంతరించుకుం ది. ఈ పరికరాల వినియోగంతో ఆసుపత్రిలో వైద్య సేవలకు అవసరమైన సదుపాయాలు మరింత బలో పేతం కానున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రు లకు వచ్చే ప్రతి పేద రోగికి నాణ్యమైన వైద్యం అందాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం సిరిసిల్ల ప్రజలకు ఉపయోగప డనుంది. వైద్య పరికరాలను సమర్థవంతం గా వినియోగిస్తూ రోగులకు మెరుగైన సేవ లు అందించాలని స్థానికులు ఆశిస్తున్నా రు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, డాక్టర్లు పాల్గొన్నారు



రూ.5 కోట్లతో భవాని కుంకుమేశ్వరాలయ అభివృద్ధి

- మూడు గోపురాల నిర్మాణానికి భూమిపూజ
- ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ప్రజానావ, పరకాల : పరకాలలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ భవాని కుంకుమేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి భూమిపూజ చేశారు. రూ.5 కోట్ల వ్యయంతో ఆలయానికి మూడు గోపురాలు నిర్మించడంతోపాటు పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎలాంటి ప్రభావం లేకుండా ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంతోపాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వాల్మీకి ఆదర్శాలు సమాజానికి మార్గదర్శకం

- ధర్మం, సత్యం, న్యాయం, మానవత్వాన్ని చాటిన రామాయణం
- వాల్మీకి జయంతి సందర్భంగా నివాళులర్పించిన అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి

ప్రజానావ, నిర్మల్ : నిర్మల్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి పాల్గొని మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృత సాహిత్యంలో మహర్షి వాల్మీకి ఆదికవిగా ప్రసిద్ధి చెందారని, ఆయన రచించిన రామాయణం ధర్మం, సత్యం, న్యాయం, మానవత్వం వంటి ఉన్నత విలువలను సమాజానికి అందించిందని తెలిపారు. రామాయణంలోని ఆదర్శాలు నేటి సమాజానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని, వాల్మీకి సాహిత్య సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన జీవితాన్ని, సాహిత్య సేవలను స్మరించుకోవడంతోపాటు రచనల్లోని నైతిక విలువలను ప్రజలకు తెలియజేయడమే జయంతి వేడుకల ముఖ్య ఉద్దేశమన్నారు. ధర్మబద్ధమైన జీవనం, క్రమశిక్షణ, పరస్పర గౌరవం, సామాజిక సామరస్యం వంటి ఆదర్శాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజంలో సద్గుణాలను పెంపొందించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ అధికారి నర్సమ్మ, ఆర్ఐలు రామనిరంజన్, శేఖర్, రామకృష్ణ, ఆర్ఎస్ఐలు, ఐటీ కోర్, డీసీఆర్బీ, వేలిముద్రల విభాగం, సమాచార ప్రసార విభాగం సిబ్బందితోపాటు జిల్లా పరిపాలనా సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- రుణమాఫీ, రైతు భరోసా బకాయిలు చెల్లించాలి
- భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్

ప్రజానావ, భైంసా : వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయా లని భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్ చేసింది. రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్ విషయం లో ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించింది. అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు 65 లక్షల మంది అర్హులైన రైతుల్లో 25 లక్షల 36 వేల మందికి మాత్రమే రుణమాఫీ చేశారని పేర్కొంది. ఇంకా 39 లక్షల మందికి రుణమాఫీ చేయాల్సి ఉందని, బ్యాంకుల పేరు మార్పు కారణంగా 64 వేల మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని తెలిపింది. వారికి వడ్డీతో సహా వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేసింది. అన్ని పంటలను కనీస మద్దతు ధరపై కొనుగోలు చేయడంతోపాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని కోరింది. కేవలం కొన్ని రకాల ధాన్యానికే కాకుండా అన్ని పంటలకు బోనస్ వర్తింపజేయాలని స్పష్టం చేసింది. రోజుకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, కనీసం ఎనిమిది గంటలు కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదని ఆరోపించింది. ఎకరాకు ఏడాదికి రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇస్తామని ప్రకటించి మూడేళ్లు గడిచినా, ఒక్కో ఎకరానికి రూ.45 వేల బకాయి ఉందని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసింది. భూమిలేని రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున మూడేళ్లకు సంబంధించిన రూ.36 వేలు అందించాలని కోరింది. రైతు బీమా మొత్తాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి పథకాన్ని పునరుద్ధరించాలని, పోడు, అసైన్డ్ భూములకు పట్టా హోదా కల్పించా లని, పట్టా భూములను 22ఏ జాబితా నుంచి తొలగించాలని సూచించింది. మూతపడిన నిజాం, మెట్టుపల్లి, బోధన్, సారంగాపూర్ చక్కెర కర్మాగారా లను తిరిగి తెరిచి, చెరకు ధరను టన్నుకు రూ.5 వేలకు పెంచాలని డిమాండ్ చేసింది. ప్రతి కమతా నికి రహదారి, సాగునీటి సౌకర్యం కల్పించాలని, కోతులు, అడవి పందుల నుంచి పంటలను రక్షించడంతోపాటు వాటి వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరింది. రైతుల ఓట్లతో గెలిచి అధికారంలోకి వచ్చిన ప్రభు త్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శిం చింది. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని భారతీయ కిసాన్ సంఘ్ హెచ్చరించింది.

మానవాళికి రామాయణం మార్గదర్శకం

కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ప్రజానావ, జనగామ : జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పాల్గొని మహర్షి చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి ఆదికవిగా ప్రసిద్ధి చెందారని, ఆయన రచించిన రామాయణం మానవ జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్‌షాలోం, ఆర్డీఏ సభ్యుడు చిలువేరు అభి గౌడ్, జిల్లా అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు కూడా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఎన్.ఎల్. నరసింహారావు, వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షుడు కెంగర్ల మల్లేష్, కార్యదర్శి వెంకటేష్, సంఘం సభ్యులు, సీనియర్ పాత్రికేయుడు కన్నా పరశురాములు, జిల్లా కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి జయ మల్లేశం, టీకేవీఎస్ ఉపాధ్యక్షుడు అభినాష్, ఇతర కుల సంఘాల సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఐడీఓసీ సిబ్బంది, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



నిర్లక్ష్యపు నీడలో పాల్కురి సోమనాథుడి స్మృతివనం

- రూ.8.08 కోట్లతో నిర్మించినా నిర్వహణ కరువు
- పిచ్చిమొక్కలు, ధ్వంసమైన తలుపులు, మద్యం సీసాలతో అధ్వానంగా మారిన ప్రాంగణం



ప్రజానావ, పాలకుర్తి : తెలుగు సాహిత్య చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించుకున్న మహాకవి పాల్కురి సోమనాథుడు జన్మించిన నేలపై ఆయన సాహిత్య సేవలకు గుర్తుగా నిర్మించిన స్మృతివనం ప్రస్తుతం నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.808 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ స్మృతివనం నిర్వహణ లోపంతో కళావిహీనంగా మారడమే కాకుండా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి ఆలయ సమీపంలో ఉన్న ఈ ప్రాంగణం చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి, పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచాల్సిన ప్రదేశం నిర్వహణ లేక వెలవెలబోతోంది. స్మృతివనంలోని గదుల తలుపులు, తాళాలు పగులగొట్టి ఉండటంతోపాటు కిటికీ అద్దాలు ధ్వంస మైన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. గదుల్లో మద్యం సీసాలు దర్శనమిస్తుండటంతో భద్రత, పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పచ్చని గడ్డితో ఆహ్లాదకరంగా ఉండాల్సిన ఉద్యానవనం పశువుల సంచారంతో కళావిహీనంగా మారింది. సాయంత్రం వేళల్లో విద్యుత్ దీపాలు లేక ప్రాంగణమంతా చీకటిమయంగా ఉంటోంది. స్మృతివనానికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన సీసీ రహదారిపై సైతం చెట్లు పెరిగి కమ్ముకోవడంతో సందర్శకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్మృతివనం పూర్తిగా శిథిలావస్థకు చేరకముందే సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు, సాహిత్యాభిమానులు కోరుతున్నారు. ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, పిచ్చిమొక్కలను తొలగించడం, మొక్కలను సంరక్షించడం, ధ్వంసమైన తలుపులు, కిటికీలకు మరమ్మతులు చేయడం, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు తక్షణమే చేపట్టాలని సూచిస్తున్నారు. స్మృతివనం పరిరక్షణకు సెక్యూరిటీ గార్డులను నియమించ డంతోపాటు పోలీసులు క్రమం తప్పకుండా పెట్రోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, కవులు, కళాకారులు కోరుతున్నారు.



ఏడాది తర్వాత స్వదేశానికి నోబెల్ శాంతి బహుమతి గ్రహీత

వెనిజువెలాకు చేరుకున్న ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడో

ప్రజానావ, కారకాస్: వెనిజువెలా ప్రతిపక్ష నాయకురాలు, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మరియా కొరినా మచాడో దాదాపు ఏడాది తర్వాత స్వదేశానికి తిరిగి చేరుకున్నారు. అరెస్టు భయంతో కొంతకాలంగా అజ్ఞాతంలో ఉన్న ఆమె.. గతంలో నోబెల్ బహుమతి స్వీకరించేందుకు దేశం విడిచి వెళ్లారు. ఆదివారం ఆమె వెనిజువెలాకు చేరుకున్నట్లు ఆమె ప్రతినిధి డేవిడ్ సోమోలాన్స్కీ వెల్లడించారు. పశ్చిమ వెనిజువెలాలోని లారా రాష్ట్రంలో ఓ చర్చిలో ఆమె ఉన్న ఫొటోలను పార్టీ విడుదల చేసింది. 'నేను ఇక్కడ ఉన్నాను.. మీ అందరితో ఉన్నాను' అంటూ మచాడో సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తన రాకను ప్రకటించారు. ఆమె స్వదేశానికి తిరిగి రావడాన్ని దేశంలో ప్రజాస్వామ్య పరివర్తనకు, స్వేచ్ఛాయుత, పారదర్శక అధ్యక్ష ఎన్నికల దిశగా కీలక ముందడుగుగా ఆమె ప్రతినిధి అభివర్ణించారు.

బ్రెజిల్ అధ్యక్షుడిగా నాలుగోసారి లూలా డ సిల్వా విజయం

- **హోరాహోరీ పోరులో ఫ్లావియో బోల్సోనారోపై గెలుపు**
- **ముందున్న సవాళ్లు ఎన్నో**



బ్రెజిల్: లాటిన్ అమెరికాలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన బ్రెజిల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు, వామపక్ష నేత లూయిస్ ఇనాసియో లూలా డ సిల్వా విజయం సాధించారు. మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో కుమారుడు, సెనేటర్ ఫ్లావియో బోల్సోనారోపై గెలుపొందిన ఆయన నాలుగోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. సుపీరియర్ ఎలక్టోరల్ కోర్టు అధికారిక ఫలితాల ప్రకారం లూలాకు 51.8 శాతం, ఫ్లావియో బోల్సోనారోకు 48.2 శాతం ఓట్లు లభించాయి. దాదాపు 40 లక్షల ఓట్ల తేడాతో లూలా విజయం సాధించినట్లు వెల్లడైంది. అక్టోబర్ 4న జరిగిన తొలి విడత పోలింగ్‌లో ఫ్లావియో బోల్సోనారో 47 శాతం ఓట్లతో ముందంజలో ఉండగా, లూలా 45 శాతం ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. అయితే ఆ తర్వాత ప్రచార వ్యూహాన్ని మార్చిన లూలా.. 'మళ్లీ బోల్సోనారో వద్దు' అనే నినాదంతో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. భారీ ర్యాలీలు, సామాజిక మాధ్యమాల ప్రచారం, సంక్షేమ పథకాలు, ప్రజా రవాణాపై ఇచ్చిన హామీలు ఆయన విజయానికి దోహదపడ్డాయి. ఫలితాలు వెలువడిన అనంతరం సావో పాలో సహా పలు ప్రధాన నగరాల్లో లూలా మద్దతుదారులు సంబరాలు చేసుకున్నారు. మాజీ కార్మిక నాయకుడైన లూలా 2003 నుంచి 2010 వరకు రెండుసార్లు బ్రెజిల్ అధ్యక్షుడిగా పనిచేశారు. అవినీతి కేసుల్లో జైలుకు వెళ్లినప్పటికీ, అనంతరం న్యాయస్థానాల పరిణామాలతో ఆ కేసుల్లో ఆయనకు ఉపశమనం లభించడంతో 2023లో తిరిగి అధికారంలోకి వచ్చారు. ఆయన పాలనలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం తగ్గడం, సంక్షేమ పథకాల విస్తరణ వంటి అంశాలు ప్రజల్లో ఆదరణ పెరగడానికి దోహదపడ్డాయి. అయితే తాజా విజయం తర్వాత లూలా ముందున్న సవాళ్లు కూడా తక్కువేమీ కావు. దేశ పార్లమెంట్‌లో సంప్రదాయవాద శక్తుల ప్రాబల్యం పెరగడం, బోల్సోనారో నేతృత్వంలోని లిబరల్ పార్టీ, దాని మిత్రపక్షాలకు ఉభయ సభల్లో గణనీయమైన బలం ఉండటం ఆయన ప్రభుత్వానికి పరీక్షగా మారనుంది. ఆర్థిక లోటు, పెరుగుతున్న జీవన వ్యయం, ప్రజా రుణాలు, తీవ్ర రాజకీయ విభేదాలను అధిగమిస్తూ పాలన సాగించాల్సి ఉంటుంది. మరోవైపు, లూలా విజయం లాటిన్ అమెరికాలో విస్తరిస్తున్న మితవాద రాజకీయ ప్రభావానికి అడ్డుకట్ట వేయడంలో కీలక పరిణామమని విశ్లేషకులు భావిస్తున్నారు.

చైనా మెగా డ్యామ్‌తో బ్రహ్మపుత్రకు వరద ముప్పు

- **రూ.లక్షల కోట్ల జల విద్యుత్ ప్రాజెక్టుతో నదీ ప్రవాహం పెరిగే ప్రమాదం**
- **చైనా పరిశోధకుల హెచ్చరిక**



బీజింగ్: బ్రహ్మపుత్ర నదిపై చైనా చేపడుతున్న 168 బిలియన్ డాలర్ల భారీ జల విద్యుత్ ప్రాజెక్టుతో భవిష్యత్తులో నదిలో నీటి ప్రవాహం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని చైనా పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల వరద ముప్పు కూడా అధికమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టిబెట్ ప్రాంతంలో నిర్మిస్తున్న ఈ భారీ జల విద్యుత్ ప్రాజెక్టుపై ఈ నేపథ్యంలో చర్చ మొదలైంది. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, యున్నాన్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు టిబెట్ పీఠభూమికి సంబంధించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని 1325 నుంచి 2026 వరకు బ్రహ్మపుత్ర నది ప్రవాహ చరిత్రను విశ్లేషించారు. వాతావరణ పరిస్థితులతో నదీ ప్రవాహాన్ని అనుసంధానిస్తూ రూపొందించిన నమూనా ఆధారంగా భవిష్యత్తులో నీటి ప్రవాహం పెరగడంతోపాటు అధిక ప్రవాహాలు, వరదలు సంభవించే అవకాశాలున్నట్లు అంచనా వేశారు. ఈ పరిశోధనకు సంబంధించిన ఫలితాలు అక్టోబర్ 8న 'చైనా సైన్స్ బులెటిన్'లో ప్రచురితమయ్యాయి.

సెర్బియాలో విద్యార్థి ఉద్యమం సంచలనం

- **వూసిచ్ ఓటమి అంగీకారం**
- **స్టూడెంట్ లిస్ట్‌దే విజయమంటూ సంబరాలు**



బెల్‌గ్రేడ్: సెర్బియాలో విద్యార్థి ఉద్యమం రాజకీయ సంచలనానికి కారణమైందంటూ వెలువడిన కథనం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పార్లమెంటరీ ఎన్నికల్లో విద్యార్థుల నాయకత్వంలోని 'స్టూడెంట్ లిస్ట్' విజయం సాధించగా, దేశాధ్యక్షుడు అలెగ్జాండర్ వూసిచ్ ఓటమిని అంగీకరించినట్లు సమాచారం. ఫలితాలు వెలువడిన వెంటనే రాజధాని బెల్‌గ్రేడ్‌తో పాటు పలు నగరాల్లో యువత, విద్యార్థులు రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసుకున్నట్లు కథనం పేర్కొంది. కార్లపై తిరుగుతూ, హారన్లు మోగిస్తూ, పాటలు పాడుతూ ఆనందాన్ని వ్యక్తం చేసినట్లు తెలిపింది. ఈ ఎన్నికల్లో 'స్టూడెంట్ లిస్ట్'కు సుమారు 52.7 శాతం ఓట్లు లభించగా, వూసిచ్ నేతృత్వంలోని కూటమికి 39.2 శాతం ఓట్లు వచ్చినట్లు ప్రాథమిక ఫలితాలు వెల్లడించాయి. పార్లమెంట్‌లో విద్యార్థుల మద్దతున్న కూటమికి సుమారు 138 నుంచి 140 స్థానాలు, వూసిచ్ కూటమికి దాదాపు 103 స్థానాలు దక్కే అవకాశముందని అంచనాలు వెలువడ్డాయి. అవినీతి ఆరోపణలు, ప్రభుత్వంపై ప్రజల్లో పెరిగిన అసంతృప్తి నేపథ్యంలో ఈ ఫలితాలు సెర్బియా రాజకీయాల్లో కీలక మలుపుగా భావిస్తున్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థుల మద్దతున్న జాబితాకు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ అభినందనలు తెలిపారు. మరోవైపు, సంబరాల సందర్భంగా సెంట్రల్ బెల్‌గ్రేడ్‌లో వూసిచ్ అనుచరులు గతంలో ఏర్పాటు చేసిన గుడారాలు, కంచెలను ఆందోళన కారులు తొలగించినట్లు కథనం పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో పోలీసు వాహనాలపై రాళ్లు రువ్వడంతో ఉద్రిక్తత నెలకొన్నట్లు సమాచారం. అవినీతికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య సంస్థల్లో పారదర్శకత కోసం సాగిన విద్యార్థి ఉద్యమానికి ఈ విజయం కీలక ఘట్టంగా నిలిచింది.

మైక్రోసాఫ్ట్‌లో 60 వేల మందికి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ ఆఫర్

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సుమారు 60 వేల మంది ఉద్యోగులకు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకాన్ని ప్రకటించింది. భారత్, అమెరికా, కెనడా, బ్రిటన్‌లోని ఎంపిక చేసిన విభాగాల్లో అర్హులైన ఉద్యోగులకు ఈ అవకాశం కల్పించింది. సంస్థలో మొత్తం 2.23 లక్షల మంది పూర్తిస్థాయి ఉద్యోగులు ఉండగా, వారిలో దాదాపు 27 శాతం మందికి ఈ ఆఫర్ అందుబాటులోకి వచ్చింది. అయితే అర్హులైన ఉద్యోగులందరూ సంస్థను వీడతారని కంపెనీ ప్రకటించలేదు. ఇది పూర్తిగా స్వచ్ఛంద పథకమని, ఇందులో చేరే ఉద్యోగులకు వారి ఉద్యోగ స్థాయి, సంస్థలో పనిచేసిన కాలాన్ని బట్టి ఆర్థిక పరిహారంతో పాటు కెరీర్ ప్రణాళికకు అవసరమైన సహకారం అందిస్తామని వెల్లడించింది. అన్ని విభాగాల్లోనూ ఈ పథకం అమలు కావడం లేదని, ఆయా విభాగాల వ్యాపార అవసరాలు, వినియోగదారులకు అందించాల్సిన సేవలు, సిబ్బంది అవసరాలను బట్టి అర్హతలు మారుతాయని స్పష్టం చేసింది. కృత్రిమ మేధ, డేటా కేంద్రాల విస్తరణపై మైక్రోసాఫ్ట్ భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో, మారుతున్న వ్యాపార అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని సర్దుబాటు చేసుకోవడంతోపాటు ఖర్చులను నియంత్రించే ప్రయత్నాల్లో భాగంగా ఈ పథకాన్ని తీసుకొచ్చింది.

ట్రంప్ ఆదేశిస్తే 96 గంటల్లో ఇరాన్‌పై దాడులు

- **పశ్చిమాసియాలో అమెరికా సైన్యం సిద్ధం**
- **ఇంధన, అణు కేంద్రాలే లక్ష్యంగా ప్రణాళిక**

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలు జారీ చేసిన 96 గంటల్లోనే ఇరాన్‌పై దాడులు చేసేందుకు పశ్చిమాసియాలో అమెరికా సైన్యం సిద్ధంగా ఉన్నట్లు ఓ నివేదిక వెల్లడించింది. ఈ ప్రాంతంలో భారీగా సైనిక బలగాలను మోహరించినట్లు ఇద్దరు అమెరికా అధికారులు సీఎన్ఎన్ మీడియా సంస్థకు వెల్లడించారు. ఇరాన్‌కు చెందిన రాడార్లు, క్షిపణి ప్రయోగ వ్యవస్థలతోపాటు ఇతర కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకునేందుకు అమెరికా సన్నద్ధమైనట్లు సమాచారం. దాడులు ఎప్పుడు చేపట్టాలన్నది ట్రంప్ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది చివరిలోగా ఎప్పుడైనా ఆయన నుంచి ఆదేశాలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. అమెరికా మధ్యంతర ఎన్నికలు ముగిసిన తర్వాత దాడులకు ఆదేశాలు జారీ కావచ్చని అభిప్రాయపడ్డారు. అయితే, అమెరికా సైనిక వ్యూహాలను ఇరాన్ దళాలు సులభంగానే అర్థం చేసుకుంటున్నట్లు అధికారులు అంగీకరించారు. ఈసారి మాత్రం విస్తృత స్థాయిలో లక్ష్యాలను నిర్దేశించినట్లు పెంటగాన్ వర్గాలు తెలిపాయి. ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలు, సైనిక స్థావరాలు, అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకునే అంశాన్ని అమెరికా సెంట్రల్ కమాండ్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. మధ్యంతర ఎన్నికల తర్వాత అనుసరించాల్సిన వ్యూహంపై ట్రంప్ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని అధికారులు మీడియాకు వెల్లడించారు. ఈ నివేదికపై వైట్‌హౌస్ స్పందించలేదు.

ఇజ్రాయెల్ ప్రధాని పీఠం ఎవరికి?

- **ఈ నెల 27న ఎన్నికలు**
- **హోరాహోరీ పోరులో నెతన్యాహు, ఐసెన్‌కోట్**



జెరూసలెం: ఇజ్రాయెల్ తదుపరి ప్రధానమంత్రి ఎవరో ఈ నెల 27న జరిగే ఎన్నికలు తేల్చనున్నాయి. ప్రస్తుత ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అధికారాన్ని నిలబెట్టుకుంటారా? లేక గాడి ఐసెన్‌కోట్, నఫ్తాలి బెన్నెట్, యాయిర్ లాపిడ్, మన్సూర్ అబ్బాస్‌లలో ఎవరైనా ప్రభుత్వ పగ్గాలు చేపడతారా? అన్నది ఆసక్తికరంగా మారింది. మొత్తం 120 పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 7 దాడి సమయంలో భద్రతా వైఫల్యాలు, పెరుగుతున్న జీవన వ్యయం, అంతర్జాతీయంగా ఇజ్రాయెల్ ప్రతిష్ఠ వంటి అంశాలు ఎన్నికల్లో ప్రధాన చర్చనీయాంశాలుగా ఉన్నాయి. నెతన్యాహు నేతృత్వంలోని అధికార కూటమిలో జాతీయ భద్రతా మంత్రి ఇతమార్ బెన్-గ్విర్‌కు చెందిన ఓట్జా యెహుదిత్ వంటి అతివాద పార్టీలు, షాస్, యునైటెడ్ తోరా జుడాయిజం వంటి అల్ట్రా ఆర్థడాక్స్ పార్టీలు ఉన్నాయి.

గెలుపు అవకాశాలు ఎవరికి?

యషార్ పార్టీ నాయకుడు గాడి ఐసెన్‌కోట్, బేయాహద్ పార్టీ నాయకుడు నఫ్తాలి బెన్నెట్ ప్రధాని పదవికి పోటీపడుతున్నారు. సర్వేల ప్రకారం నెతన్యాహుకు ఐసెన్‌కోట్ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. కొన్ని సర్వేల్లో ఐసెన్‌కోట్ ముందంజలో ఉన్నట్లు వెల్లడైంది. సెప్టెంబర్ 8న వెలువడిన పాలీమార్కెట్ అంచనాల ప్రకారం ఐసెన్‌కోట్‌కు 51 శాతం, నెతన్యాహుకు 28 శాతం విజయావకాశాలు ఉన్నట్లు పేర్కొంది. 'ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్' అంచనాల ప్రకారం ప్రతిపక్ష కూటమికి 54 స్థానాలు లభించే అవకాశం ఉండగా, నెతన్యాహు నేతృత్వంలోని మితవాద, అల్ట్రా ఆర్థడాక్స్ పార్టీల కూటమికి 48 నుంచి 49 స్థానాలు రావొచ్చని అంచనా. 120 మంది సభ్యులున్న నెస్సెట్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు కనీసం 61 మంది సభ్యుల మద్దతు అవసరం. ఈ నేపథ్యంలో ఏ కూటమికీ సొంతంగా మెజారిటీ వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. అరబ్ ప్రాబల్యం ఉన్న పార్టీలు సుమారు 13 స్థానాలు గెలుచుకోవచ్చన్న అంచనాలతో వాటి మద్దతు కీలకం కానుంది.

కూటములదే కీలకపాత్ర

ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే నెతన్యాహుకు మితవాద, అతివాద, అల్ట్రా ఆర్థడాక్స్ మిత్రపక్షాల మద్దతు అవసరం. ప్రతిపక్ష పార్టీలు కూడా ప్రభుత్వ ఏర్పాటుకు ఇతర పార్టీలతో చేతులు కలపాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అరబ్ నేతృత్వంలోని పార్టీలు కీలకపాత్ర పోషించే అవకాశం ఉంది. అయితే వాటిని కూటమిలో చేర్చుకునే విషయంలో ప్రధాన ప్రతిపక్ష నేతలు వెనుకంజ వేస్తుండగా, ఆ పార్టీల మద్దతును నెతన్యాహు బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఎన్నికల అనంతరం కూటముల సమీకరణాలే ప్రభుత్వ ఏర్పాటును నిర్ణయించే అవకాశముంది.

యూరప్‌లో ఆందోళనల సెగ

- **పలు నగరాల్లో హింసాత్మక ఘటనలు**
- **ఇటలీ, అల్బేనియాలో ఘర్షణలు**
- **పింఛన్లు, గృహవసతి, విద్య సమస్యలపై నిరసనలు**



రోమ్: యూరప్‌లోని పలు దేశాల్లో నిరసనలు, హింసాత్మక ఘటనలు కలకలం సృష్టిస్తున్నాయి. గతవారం జరిగిన ఘర్షణలు, దుకాణాలపై దాడులు, దోపిడీలు పునరావృతం కాకుండా ఇటలీ అధికారులు భారీగా పోలీసులను, సైనికులను మోహరించారు. శనివారం మిలాన్, రోమ్, ట్యూరిన్ సహా పలు నగరాల్లో వేలాది మంది యువత ర్యాలీలు నిర్వహించారు. మిలాన్‌లో నిరసనలు ప్రశాంతంగా ముగియగా, రోమ్, ట్యూరిన్‌లలో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. మిలాన్‌లో భద్రతను కట్టుదిట్టం చేయడంతోపాటు విలాసవంతమైన దుకాణాలకు రక్షణ కల్పించారు. గతవారం హింసాత్మక ఘటనల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు గుర్తించిన పోలీసులు, ముందుజాగ్రత్తగా పలువురు మైనర్లను అదుపులోకి తీసుకున్నట్లు మీడియా వెల్లడించింది. ప్రధాని జార్జియా మెలోనీ అదనంగా 500 మంది సైనికులను మిలాన్‌కు పంపడంతో పాటు, మైనర్లపై కఠిన చర్యలు తీసుకునేందుకు పలు నిర్ణయాలు ప్రకటించారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న నిరసనలకు అంతర్జాతీయంగా ప్రాధాన్యం లభిస్తున్నప్పటికీ, శనివారం మిలాన్, రోమ్ నుంచి మాడ్రిడ్, లిస్బన్, టిరానా వరకు అనేక నగరాల్లో భారీ ప్రదర్శనలు జరిగాయి. విద్య, అవినీతి, యుద్ధ వ్యతిరేక ఉద్యమాలు, పింఛన్లు, గృహవసతి వంటి సమస్యలపై ప్రజలు ఆందోళన చేపట్టారు.

కొలోస్సియంలోకి చొరబడేందుకు యత్నం

ఇటలీ రాజధాని రోమ్‌లో భద్రతను కట్టుదిట్టం చేసి, విలాసవంతమైన దుకాణాలు ఉన్న వీధులను మూసివేశారు. కొందరు నిరసనకారులు ప్రసిద్ధ కొలోస్సియంలోకి బలవంతంగా ప్రవేశించేందుకు ప్రయత్నించగా, భద్రతా సిబ్బంది వారిని అడ్డుకున్నారు. మరోవైపు, తాము అల్లర్లకు పాల్పడేవాళ్లం కాదని స్పష్టం చేస్తూ వందలాది మంది విద్యార్థులు ప్రశాంతంగా నిరసన తెలిపారు. అల్బేనియా రాజధాని టిరానాలో నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులపై పోలీసులు నీటి ఫిరంగులను ప్రయోగించారు. కొందరు నిరసనకారులు ప్రభుత్వ భవనాలకు నిప్పుపెట్టడంతోపాటు పోలీసులపై వస్తువులు విసిరారు. వారం రోజులకుపైగా కొనసాగుతున్న ఆందోళనల్లో రాళ్లు, నిప్పంటించే వస్తువులు, పెట్రోల్ బాంబులు, బాణసంచాతో పోలీసులపై దాడులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. దీనికి ప్రతిగా పోలీసులు లాఠీచార్జి, బాష్పవాయువును ప్రయోగిస్తున్నారు. విద్యాసంస్థల్లో ఫీజులు తగ్గించాలని, విద్యారంగంలో ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలని ఉన్నత పాఠశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. విద్యావ్యవస్థలో అవినీతిని కూడా వ్యతిరేకిస్తున్నారు.

పింఛన్ల మార్పులపై మాడ్రిడ్‌లో నిరసన

స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో వేలాది మంది విశ్రాంత ఉద్యోగులు, ఇతరులు శనివారం శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. పింఛన్ల వ్యవస్థలో మార్పులు చేసి తమ ప్రయోజనాలను దెబ్బతీయొద్దని డిమాండ్ చేశారు. పింఛన్లను ప్రైవేటీకరించే ప్రమాదం ఉందని, వాటి ద్వారా లాభాలు పొందేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని 68 ఏళ్ల మరియా జోస్ బెనెటో ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే నెలలో ముందస్తు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ నిరసనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, ఇళ్ల అద్దెలు, కొనుగోలు ధరలు భారీగా పెరగడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గృహవసతి సమస్యపైనా నిరసనలు వెల్లువెత్తాయి.

లిస్బన్‌లో అందుబాటు ఇళ్ల కోసం ఆందోళన

పోర్చుగల్ రాజధాని లిస్బన్‌లోనూ వేలాది మంది అందుబాటు ధరల్లో ఇళ్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోంటెనెగ్రో ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కొన్ని ప్రతిపాదనలను నిరసనకారులు వ్యతిరేకించారు. ఏటా అద్దెల పెంపుపై ఉన్న పరిమితులను సడలించడం, అద్దె చెల్లించని వారిని ఇళ్ల నుంచి ఖాళీ చేయించడం సులభతరం చేయడం వంటి చర్యలు అద్దెదారులకు నష్టం కలిగిస్తాయని విమర్శించారు. ఈ ప్రతిపాదనలు అద్దెదారులను మరింత బలహీనమైన స్థితిలోకి నెడతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

జార్జియా ఓటర్ల డేటాను యాక్సెస్ చేసిన క్లాడ్ ఏఐ

- **మానవ అనుమతి లేకుండానే పేవాల్ దాటినట్లు ఆంథ్రోపిక్ వెల్లడి**
- **ఓటింగ్ రికార్డులు మాత్రం భద్రం**

వాషింగ్టన్: కృత్రిమ మేధ (ఏఐ) మోడల్ క్లాడ్ పేవాల్‌ను దాటి, మానవ అనుమతి లేకుండానే అమెరికాలోని జార్జియా రాష్ట్రానికి చెందిన బహిరంగంగా అందుబాటులో ఉన్న ఓటర్ల డేటా మొత్తాన్ని యాక్సెస్ చేసిందని ఏఐ సంస్థ ఆంథ్రోపిక్ వెల్లడించింది. అయితే రాష్ట్ర ఓటరు నమోదు వ్యవస్థలోకి ప్రవేశించడం, అందులోని వివరాలను మార్చడం లేదా ఓటింగ్ రికార్డులను వెలికితీయడం వంటివి క్లాడ్ చేయలేదని స్పష్టం చేసింది. ఇలాంటి చర్యలను నిరోధించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. అమెరికా ప్రభుత్వ ఆధ్వర్యంలోని వెబ్‌సైట్లలో ఉన్న డేటాను కూడా క్లాడ్ యాక్సెస్ చేయగలిగిందని ఈ నెల ప్రారంభంలో ఆంథ్రోపిక్ వెల్లడించింది. జార్జియా ఓటర్ల డేటాను క్లాడ్ యాక్సెస్ చేసిన వ్యవహారంపై ఆ రాష్ట్ర ఎన్నికల అధికారి నుంచి ఇంకా స్పందన వెలువడలేదు.

ఓటర్ల జాబితాలపై వరుస వివాదాలు

- **ఈసీపై పెరుగుతున్న ఒత్తిడి**
- **మధ్యప్రదేశ్‌లో నదీ తీరంలో 343 ఓటరు కార్డులు**
- **యూపీలో దరఖాస్తుల ఆడిట్, కర్ణాటకలో 2.28 లక్షల ఫామ్–7 దరఖాస్తులు**

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలకు సంబంధించిన వివాదాలు ఎన్నికల సంఘానికి సవాలుగా మారాయి. ఓటర్ల రికార్డుల నిర్వహణ, ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్ జిల్లా మండ్లేశ్వర్ వద్ద నర్మదా నది తీరంలో ఇండోర్ చిరునామాలతో ఉన్న 343 ఓటరు గుర్తింపు కార్డులు లభించడం, ఉత్తరప్రదేశ్‌లో ఓటరు దరఖాస్తులపై సమగ్ర తనిఖీకి ఆదేశాలు జారీ కావడం, కర్ణాటకలో లక్షల సంఖ్యలో ఫామ్–7 దరఖాస్తులు అందడం రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ పరిణామాలపై ప్రతిపక్షాలు ఎన్నికల ప్రక్రియ పారదర్శకతను ప్రశ్నిస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లో నదీ తీర శుభ్రత కార్యక్రమం సందర్భంగా మండ్లేశ్వర్ ఘాట్ వద్ద 343 ఓటరు గుర్తింపు కార్డులు బయటపడటంతో వివాదం మొదలైంది. ఇండోర్‌కు చెందిన చిరునామాలు కలిగిన ఈ కార్డులు సుమారు 90 కిలోమీటర్ల దూరంలోని నదీ తీరానికి ఎలా చేరాయనే అంశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ముగిసిన ఏప్రిల్ 10 తర్వాత కంప్యూటర్ సహాయకుల ద్వారా నమోదు చేసిన ఫామ్–6, ఫామ్–7, ఫామ్–8 దరఖాస్తులపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని ఎన్నికల సంఘం యంత్రాంగం ఆదేశించింది. పిలిభిత్, ఆజంగఢ్ ప్రాంతాల్లో అక్రమాలు జరిగినట్లు నివేదికలు రావడంతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నవదీప్ రిన్వా ఈ నిర్ణయం తీసుకున్నారు. తనిఖీల్లో అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరోవైపు, కర్ణాటకలోనూ ఓటర్ల జాబితా వివాదం ప్రాధాన్యం సంతరించుకుంది. అధికారిక గణాంకాల ప్రకారం జూన్ 16 నుంచి అక్టోబర్ 22 మధ్య రాష్ట్రంలో 2,28,917 ఫామ్–7 దరఖాస్తులు అందాయి. ఓటర్ల జాబితాలో ఒకరి పేరును చేర్చడంపై అభ్యంతరం తెలపడానికి లేదా ఇప్పటికే ఉన్న పేరును తొలగించాలని కోరడానికి ఈ ఫామ్‌ను వినియోగిస్తారు. ప్రస్తుత సవరణ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు గంపగుత్తగా సమర్పిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ గణాంకాలు రాజకీయ వివాదానికి దారితీశాయి. మూడు రాష్ట్రాల్లో చోటుచేసుకున్న ఈ పరిణామాలతో ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో పారదర్శకత, దరఖాస్తుల పరిశీలన, ఓటర్ల వివరాల భద్రతపై చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది.

సిరీస్ విజయంపై భారత్ కన్ను

- నేడు న్యూజిలాండ్‌తో మూడో టీ20
- భువనేశ్వర్ బౌలింగ్‌పై ప్రత్యేక దృష్టి
- వెల్లింగ్టన్‌లో బలమైన గాలులతో ఇరు జట్లకు పరీక్ష



వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో మూడో టీ20లోనూ గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భారత జట్టు పట్టుదలగా ఉంది. మంగళవారం జరిగే ఈ మ్యాచ్‌లో అనుభవజ్ఞుడైన భువనేశ్వర్ కుమార్, నిలకడైన బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ కీలకం కానున్నారు. 2020 నుంచి న్యూజిలాండ్ గడ్డపై టీ20 సిరీస్‌లలో భారత్ అజేయంగా కొనసాగుతోంది. ఆ రికార్డును నిలబెట్టుకోవాలని శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని జట్టు భావిస్తోంది. క్రైస్ట్‌చర్చ్‌లో జరిగిన తొలి రెండు మ్యాచ్‌ల్లోనూ భారీ స్కోర్లతో భారత్ విజయం సాధించింది. నాలుగేళ్ల విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగొచ్చిన భువనేశ్వర్‌కు పునరాగమనం ఆశించిన స్థాయిలో సాగలేదు. తొలి రెండు మ్యాచ్‌ల్లో నాలుగు ఓవర్ల కొప్పున బౌలింగ్ చేసి వరుసగా 49, 50 పరుగులు సమర్పించుకున్నాడు. అయినా అతడిపై ఒత్తిడి పెంచకుండా, అంతర్జాతీయ స్థాయిలో మళ్లీ లయ అందుకునేందుకు సమయం ఇవ్వాలని భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ పేర్కొన్నాడు. అర్ష్‌దీప్ తోడైతే న్యూజిలాండ్ టాప్ ఆర్డర్‌ను ఇబ్బంది పెట్టగలరని భారత్ ఆశిస్తోంది.

గాలులతో కొత్త సవాల్

మూడు వైపులా బహిరంగంగా ఉండే బేసిన్ రిజర్వ్ మైదానంలో బలమైన గాలులు ఆటగాళ్లకు పరీక్షగా నిలవనున్నాయి. చల్లని వాతావరణంలో సాయంత్రం మ్యాచ్ జరగనుండటంతో భారత బ్యాటర్లకు కూడా సవాల్ తప్పదు. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్ గాలుల ప్రభావాన్ని ఎలా అధిగమిస్తారన్నది ఆసక్తికరం. 15 ఏళ్ల వైభవ్‌కు ఇలాంటి పరిస్థితుల్లో ఆడటం భవిష్యత్తులో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

బౌలింగ్ లోపాలపై దృష్టి

తొలి రెండు మ్యాచ్‌ల్లో భారత్ 13 మంది ఆటగాళ్లకు అవకాశం ఇచ్చింది. గాయపడిన ఇషాన్ కిషన్ స్థానంలో వైభవ్ సూర్యవంశీ జట్టులోకి వచ్చాడు. రెండో మ్యాచ్‌లో మయాంక్ యాదవ్ స్థానంలో డెత్ ఓవర్ల స్పెషలిస్ట్ ప్రిన్స్ యాదవ్ ఆడాడు. తిలక్ వర్మ, నమన్ ధీర్, నితీశ్ కుమార్ రెడ్డిని మిడిలార్డర్‌లో ఉపయోగించిన కోచ్ గౌతమ్ గంభీర్ వ్యూహం ఫలించింది. అయితే బౌలింగ్‌లో లోపాలను సరిదిద్దుకోవడంపై భారత్ దృష్టి పెట్టాల్సి ఉంది. లాకీ ఫెర్గూసన్, మాట్ హెన్రీ అందుబాటులో లేకపోవడం న్యూజిలాండ్‌కు ప్రతికూలం కావచ్చు.

బలమైన గాలులకు అలవాటు పడండి

న్యూజిలాండ్‌లోని వెల్లింగ్టన్ బలమైన గాలులను ఎదుర్కొనేందుకు భారత టెస్టు ఆటగాళ్లు ఇంట్లోనే బలమైన ఫ్యాన్ ముందు సాధన చేయాలని బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ సరదాగా సూచించాడు. న్యూజిలాండ్ పర్యటనకు ఇంకా చేరుకోని టెస్టు స్పెషలిస్టులకు ఈ సలహా ఇచ్చినట్లు వెల్లడించాడు. 'విండీ వెల్లింగ్టన్'గా పేరున్న ఈ నగరంలో సోమవారం గంటకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. గాలుల తీవ్రతతో హోటల్ భవనం సైతం కంపిస్తున్నట్లు అనిపించిందని మోర్కెల్ తెలిపాడు. బ్యాటింగ్‌లో నిలబడే తీరు, క్రీజులో కదలికలు, బౌలింగ్‌పై గాలుల ప్రభావం ఉంటుందని వివరించాడు. రెండు, మూడు రోజుల సాధనతోనే ఈ పరిస్థితులకు అలవాటు పడటం కష్టమని, ఆటగాళ్లు మానసికంగా సిద్ధం కావాలని సూచించాడు.

వ్యూహాలు మార్చుకోవాలి

గాలికి ఎదురుగా బౌలింగ్ చేసేందుకు బౌలర్లు సిద్ధంగా ఉండాలని మోర్కెల్ పేర్కొన్నాడు. న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ మైకేల్ బ్రేస్‌వెల్ మాట్లాడుతూ.. గాలి దిశ, వేగాన్ని బట్టి బ్యాటింగ్, బౌలింగ్ వ్యూహాలను మార్చుకోవాల్సి ఉంటుందని తెలిపాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇలాంటి విభిన్న పరిస్థితులను ఎదుర్కోవడం ఆటలో భాగమని పేర్కొన్నాడు.

కామన్వెల్త్ కబడ్డీ సెమీస్‌కు భారత మహిళలు

- నైజీరియాపై 38–10తో ఘన విజయం
- పురుషుల జట్టుదీ అదే జోరు.. 50–23తో గెలుపు
- రెండు జట్లకూ టోర్నీలో వరుసగా నాలుగో విజయం



అహ్మదాబాద్: తొలి కామన్వెల్త్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టు సెమీఫైనల్‌కు దూసు కెళ్లింది. సోమవారం నైజీరియాతో జరిగిన మ్యాచ్‌లో 38–10తో ఘన విజయం సాధించింది. పురుషుల జట్టు సైతం అదే ప్రత్యర్థిపై 50–23తో నెగ్గింది. ఈ టోర్నీలో ఇరు భారత జట్లకూ ఇది నాలుగో విజయం. మ్యాచ్ ఆరంభం నుంచే భారత మహిళలు ఆధిపత్యం ప్రదర్శించారు. తొలి అర్ధభాగం ముగిసేసరికి 24–6తో ఆధిక్యంలో నిలిచారు. ద్వితీయార్ధంలో మరో 14 పాయింట్లు సాధించి విజయాన్ని ఖాయం చేసుకున్నారు. భారత రైడర్ అనూ 17 రైడ్లలో 11 పాయింట్లతో సత్తా చాటింది. సాక్షి నాలుగు రైడ్ పాయింట్లు సాధించగా.. కెప్టెన్ నిధి శర్మ రెండు పాయింట్లు జోడించింది. రక్షణ విభాగంలో సభాయ్ గాధవి మూడు ట్యాకిల్ పాయింట్లు సాధించింది. ప్రియా, రీతు రెండేసి పాయింట్లతో రాణించారు. నైజీరియా తరఫున రాబర్ట్ మోసెస్ ఆరు రైడ్ పాయింట్లు సాధించగా, బాస్సీ ఎడెట్ రెండు పాయింట్లు జోడించాడు. భారత రైడర్లను నిలువరించడంలో నైజీరియా రక్షణ విభాగం విఫలమైంది.

సచిన్ కీలకపాత్ర

భారత పురుషుల జట్టు తొలి అర్ధభాగంలోనే 25–7తో ఆధిక్యం సాధించింది. మొత్తం రైడ్ పాయింట్లలో 31–21తో, ట్యాకిల్ పాయింట్లలో 7–2తో పైచేయి సాధించింది. సచిన్ 12 పాయింట్లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించగా.. ఆదిత్య షిండే 11 రైడ్ పాయింట్లు సాధించాడు. పంకజ్ మొహితే ఎనిమిది రైడ్ పాయింట్లతో పాటు రెండు ట్యాకిల్ పాయింట్లు సాధించాడు. రక్షణలో సుర్జీత్ నర్వాల్ నాలుగు ట్యాకిల్ పాయింట్లతో మెరిశాడు. నైజీరియా తరఫున ఎడెమ్ విజ్డమ్ ఇటా ఎనిమిది రైడ్ పాయింట్లు సాధించాడు. ఎక్పే విక్టరీ ఇమ్మాన్యుయేల్ ఆరు, ఇజు ప్రిన్స్ ఉడా ఐదు పాయింట్లు సాధించారు. ద్వితీయార్ధంలో నైజీరియా 16 పాయింట్లు సాధించినప్పటికీ.. భారత ఆధిక్యాన్ని అధిగమించలేకపోయింది. మహిళల జట్టు శుక్రవారం గ్రూప్–బిలో రెండో స్థానంలో నిలిచిన జట్టుతో సెమీఫైనల్లో తలపడనుంది. పురుషుల జట్టు మంగళవారం టాంజానియాను ఎదుర్కోనుంది. ఇతర మ్యాచ్‌ల్లో సింగపూర్ పురుషుల జట్టు 59–32తో ఆస్ట్రేలియాను ఓడించింది. సింగపూర్ తరఫున శ్రీరామ్ రాజా 15 పాయింట్లతో రాణించాడు.

హైలో ఓపెన్‌పై సింధు గురి

- ఫ్రెంచ్ ఓపెన్ జోరు కొనసాగించాలని పట్టుదల
- లక్ష్యసేన్, ఆయుష్ శెట్టి, ప్రణయ్‌పైనా ఆశలు

సార్‌బ్రూకెన్: ఫ్రెంచ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత స్టార్ పీవీ సింధు మరో టైటిల్‌పై కన్నేసింది. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే 5 లక్షల డాలర్ల ప్రైజ్‌మనీతో కూడిన హైలో ఓపెన్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీలో ఆమె భారత బృందానికి నాయకత్వం వహించనుంది. ఈ ఏడాది జపాన్ ఓపెన్ టైటిల్ సాధించిన సింధు.. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో టర్కీకి చెందిన నెస్లిహాన్ అరిన్‌తో తలపడనుంది. పురుషుల విభాగంలో ఏడో సీడ్ లక్ష్యసేన్.. ఫిన్లాండ్ ఆటగాడు జోకిమ్ ఓల్టోర్ఫ్‌తో, ఎనిమిదో సీడ్ ఆయుష్ శెట్టి.. తైవాన్ క్రీడాకారుడు సు లీ యాంగ్‌తో ఆడనున్నారు. హెచ్ఎస్ ప్రణయ్ తొలి రౌండ్‌లోనే మూడో సీడ్, ప్రపంచ ఛాంపియన్ అలెక్స్ లానియర్ (ఫ్రాన్స్)ను ఎదుర్కోనున్నాడు. కిరణ్ జార్జ్, తరుణ్ మన్నెపల్లి కూడా బరిలోకి దిగనున్నారు. మహిళల సింగిల్స్‌లో కొరియా మాస్టర్స్ విజేత ఆష్మితా చాలిహా.. బల్గేరియా క్రీడాకారిణి కలోయానా నల్బంతోవాతో తలపడనుంది. దేవికా సిహాగ్, ఆకర్షి కశ్యప్, మాళవిక బన్సోడ్, ఉన్నతి హూడా కూడా పోటీలో ఉన్నారు. ఇషారాణి బారువా, అన్మోల్ ఖర్బ్ అర్హత పోటీల్లో పాల్గొననున్నారు.

డేవిస్ కప్ ఫైనల్–8కు అల్కరాజ్, జ్వెరెవ్

- రెండేళ్ల తర్వాత బరిలోకి స్పెయిన్ స్టార్
- జర్మనీ జట్టుకు అలెగ్జాండర్ జ్వెరెవ్ నాయకత్వం
- గాయం కారణంగా దూరమైన డిఫెండింగ్ చాంపియన్ సినర్

బొలోగ్నా: డేవిస్ కప్ ఫైనల్–8 టోర్నీకి స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాజ్, జర్మనీ అగ్రశ్రేణి ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్ ఎంపికయ్యారు. వచ్చే నెల 24 నుంచి 29 వరకు ఇటలీలోని బొలోగ్నాలో జరిగే ఈ పోటీల కోసం ఆయా జట్లు సోమవారం ప్రకటించారు. రెండేళ్ల విరామం తర్వాత అల్కరాజ్ డేవిస్ కప్‌లో ఆడనున్నాడు. 2024 ఫైనల్–8 తర్వాత అతడు ఈ టోర్నీలో పాల్గొనలేదు. ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ సాధించి కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేసిన అల్కరాజ్.. తన ఖాతాలో లేని అరుదైన ప్రధాన టైటిళ్లలో ఒకటైన డేవిస్ కప్‌ను గెలవాలని పట్టుదలతో ఉన్నాడు. స్పెయిన్ జట్టులో ప్రపంచ టాప్–15లో ఉన్న రఫెల్ జోడార్ (11వ ర్యాంకు), అలెజాండ్రో దేవిడోవిచ్ ఫోకినా (15వ ర్యాంకు) కూడా చోటు దక్కించుకున్నారు. దేవిడ్ ఫెరర్ కెప్టెన్సీలో బరిలోకి దిగనున్న స్పెయిన్.. క్వార్టర్‌ఫైనల్లో ఆస్ట్రియాతో తలపడుతుంది. జర్మనీ జట్టుకు జ్వెరెవ్ నాయకత్వం వహించనున్నాడు. ఈ టోర్నీకి ముందే అతడు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకును అందుకోనున్నట్లు సమాచారం. జర్మనీ క్వార్టర్‌ఫైనల్లో బ్రిటన్‌ను ఎదుర్కొంటుంది. వింబుల్డన్ సెమీఫైనలిస్ట్ ఆర్థర్ ఫెరీ బ్రిటన్ జట్టులో కీలక ఆటగాడిగా ఉన్నాడు.

సినర్ లేకుండానే ఇటలీ

వరుసగా మూడుసార్లు డేవిస్ కప్ విజేతగా నిలిచిన ఇటలీ ఈసారి గాయంతో జానిక్ సినర్ సేవలను కోల్పోయింది. ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ ఫ్లావియో కోబొల్లి ఆ జట్టుకు ప్రధాన ఆటగాడిగా ఉండనున్నాడు. ఇక ఫైనల్–8లో చెకియా, కెనడా, ఇటలీ, దక్షిణ కొరియా, బ్రిటన్, జర్మనీ, ఆస్ట్రియా, స్పెయిన్ జట్లు పోటీ పడనున్నాయి. ఆయా జట్లలో ఫెలిక్స్ ఆగర్–అలియాసిమ్, డెనిస్ షాపోవలోవ్, లోరెంజో ముసెట్టి, కామెరాన్ నోరీ వంటి ప్రముఖ ఆటగాళ్లు కూడా ఉన్నారు.



ఐపీఓ బరిలో ఏఐ దిగ్గజం ఆంథ్రోపిక్

- 100 బిలియన్ డాలర్ల వరకు నిధుల సమీకరణపై అంచనాలు
- స్పేస్‌ఎక్స్ ఐపీఓ రికార్డును అధిగమించే అవకాశం

శాన్‌ఫ్రాన్సిస్కో: కృత్రిమ మేధ దిగ్గజం ఆంథ్రోపిక్ తొలిసారిగా స్టాక్ మార్కెట్లోకి ప్రవేశించేందుకు సిద్ధమైంది. ఐపీఓ కోసం సోమవారం నియంత్రణ సంస్థలకు పత్రాలు సమర్పించింది. ఈ ఇష్యూ ద్వారా 100 బిలియన్ డాలర్ల వరకు నిధులు సమీకరించవచ్చని అంచనాలున్నాయి. ఇదే జరిగితే ఈ ఏడాది జూన్‌లో 86 బిలియన్ డాలర్లు సమీకరించిన స్పేస్‌ఎక్స్ రికార్డు బద్దలయ్యే అవకాశముంది. వచ్చే నెలలో లిస్టింగ్ జరగవచ్చని సమాచారం. నాస్‌డాక్‌లో 'ఏఎన్‌టీ' టికర్‌తో షేర్లను నమోదు చేయనున్నట్లు సంస్థ తెలిపింది. చాట్‌బాట్ 'క్లాడ్'ను అభివృద్ధి చేసిన ఆంథ్రోపిక్ 2026 తొలి ఆరు నెలల్లో 80.7 బిలియన్ డాలర్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో నష్టం 13 బిలియన్ డాలర్లుగా ఉంది. ఈ ఏడాది ప్రైవేటు పెట్టుబడిదారులు సంస్థ విలువను 965 బిలియన్ డాలర్లుగా అంచనా వేయగా, ఐపీఓ సమయానికి అది 1.5 లక్షల కోట్ల నుంచి 2 లక్షల కోట్ల డాలర్లకు చేరవచ్చని వార్తలు వస్తున్నాయి.

ఏఐ ప్రమాదాలపై హెచ్చరిక

ఐపీఓతో భారీగా నిధులు సమీకరించేందుకు సిద్ధమవుతున్న సంస్థ సీఈఓ దారియో అమోడెయ్ ఇటీవల అత్యాధునిక ఏఐ నమూనాల అభివృద్ధిని నెమ్మదించాలని అభిప్రాయపడ్డారు. అధునాతన ఏఐ మానవాళి మనుగడకే ముప్పుగా మారవచ్చని హెచ్చరించడం గమనార్హం.

ఈ100 ఇంధన వాహనాలకు అనుమతి

న్యూఢిల్లీ: దాదాపు స్వచ్ఛమైన ఇథనాల్ (ఈ100)తో నడిచే ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల వినియోగానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ సోమవారం మోటారు వాహన నిబంధనలను సవరించింది. ముడిచమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ20 కంటే అధిక ఇథనాల్ కలిగిన ఈ85, ఈ100 ఇంధనాలను ఉపయోగించేందుకు ప్రత్యేకంగా రూపొందించి, ధ్రువీకరించిన వాహనాలకే అనుమతి ఉంటుంది. సాధారణ పెట్రోల్ వాహనాల్లో వీటిని వినియోగించడానికి వీలుండదు. తాజా సవరణల్లో తేలికపాటి పెట్రోల్, డీజిల్ వాహనాల బరువు పరిమితిని 3,000 కిలోల నుంచి 3,500 కిలోలకు పెంచడంతోపాటు ఇంధన ప్రమాణాలు, ఉద్గారాల పరీక్షలకు సంబంధించిన నిబంధనల్లోనూ మార్పులు చేశారు.

ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల అభివృద్ధి

ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ20 ఇంధనం అందుబాటులో ఉంది. మారుతీ సుజుకీ ఇండియా ఈ ఏడాది జూన్‌లో ఈ20 నుంచి ఈ100 వరకు ఇథనాల్–పెట్రోల్ మిశ్రమాలతో నడిచే వాగన్‌ఆర్ ఫ్లెక్స్ ఫ్యూయల్ కారును పరిచయం చేసింది. టయోటా, టాటా మోటార్స్, హ్యుందాయ్ సంస్థలు కూడా ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల అభివృద్ధిపై దృష్టి సారించాయి. ఇథనాల్ వినియోగం పెరగడం ద్వారా ముడిచమురు దిగుమతుల వ్యయాన్ని తగ్గించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

చంద్రశేఖరన్ పునర్నియామకంపై నోయల్ టాటా అభ్యంతరం

- 2027 ఫిబ్రవరి తర్వాత మరో ఐదేళ్ల పదవీకాలానికి వ్యతిరేకత
- బోర్డు సమావేశంలో తీర్మానమే అజెండాలో లేదని వాదన
- సమావేశం వీడియో రికార్డింగ్ ఇవ్వాలని లేఖ



ముంబై: టాటా సన్స్ చైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్నియామకానికి సంబంధించిన తీర్మానంపై టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా అభ్యంతరం వ్యక్తం చేశారు. 2027 ఫిబ్రవరి తర్వాత మరో ఐదేళ్ల పాటు చంద్రశేఖరన్‌ను చైర్మన్‌గా కొనసాగించేందుకు సెప్టెంబరు 17న టాటా సన్స్ బోర్డు సమావేశంలో ఆమోదించిన తీర్మానాన్ని ఆయన సవాలు చేశారు. ఈ మేరకు సోమవారం కంపెనీ కార్యదర్శి సుప్రకాశ్ ముఖోపాధ్యాయకు లేఖ రాశారు. చంద్రశేఖరన్ పునర్నియామక తీర్మానం చెల్లదని నోయల్ టాటా పేర్కొన్నట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు వెల్లడించాయి. సమావేశానికి సంబంధించిన నోటీసు, అజెండా సహా పలు అంశాలను ఆయన తన అభ్యంతరాలకు ఆధారంగా చూపినట్లు తెలిపాయి. నామినేషన్, పారితోషికాల కమిటీ నివేదికపై వివరణకే సమావేశం పరిమితమైందని, ఛైర్మన్ పునర్నియామక అంశాన్ని అజెండాలో చేర్చలేదని నోయల్ వాదించినట్లు పేర్కొన్నాయి.

ఓటింగ్‌లోనూ వ్యతిరేకత

టాటా సన్స్‌లో మూడింట రెండొంతుల వాటా కలిగిన టాటా ట్రస్ట్స్‌కు నోయల్ నేతృత్వం వహిస్తున్నారు. చంద్రశేఖరన్ పునర్నియామకంపై జరిగిన ఓటింగ్‌లో ఆయన వ్యతిరేకంగా ఓటు వేయగా, టాటా ట్రస్ట్స్ నుంచి బోర్డులో ఉన్న మరో డైరెక్టర్ వేణు శ్రీనివాసన్ మెజారిటీకి మద్దతుగా నిలిచారు. అనితా జార్జ్, హరీశ్ మన్వానీ, సౌరభ్ అగర్వాల్ కూడా పునర్నియామకానికి అనుకూలంగా ఓటు వేశారు. టాటా సన్స్ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ ప్రకారం, ఒక తీర్మానం ఆమోదం పొందాలంటే టాటా ట్రస్ట్స్ నామినీ డైరెక్టర్లు అనుకూలంగా ఓటు వేయాల్సి ఉంటుందని నోయల్ తన లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. బోర్డు సమావేశానికి సంబంధించిన ఎలాంటి ఎడిటింగ్ చేయని వీడియో రికార్డింగ్‌ను కూడా ఆయన కోరారు. ఈ అంశంపై వ్యాఖ్యానించాలని టాటా సన్స్, టాటా ట్రస్ట్స్‌ను సంప్రదించగా వెంటనే స్పందన రాలేదు.

సైబర్ భద్రతకు ఎస్‌బీఐ ప్రత్యేక కేంద్రం

- 1.81 లక్షల మంది సిబ్బందికి సైబర్ సెక్యూరిటీ శిక్షణ
- ఈవీల కొనుగోలుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొత్త రుణ పథకం



ముంబై: దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు ఎస్‌బీఐ సైబర్ భద్రతను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక కేంద్రాన్ని ప్రారంభించింది. అభివృద్ధి చెందుతున్న సైబర్ ముప్పులను ముందుగానే గుర్తించి, వాటిని సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుకోవడమే ఈ కేంద్రం లక్ష్యమని బ్యాంకు తెలిపింది. 'సైరిస్' పేరుతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా ముప్పుల సమాచార విశ్లేషణ, సైబర్ రక్షణ, డిజిటల్ ఫోరెన్సిక్స్, మాల్‌వేర్ విశ్లేషణ, ఎథికల్ హ్యాకింగ్, మోసాల విశ్లేషణ, కృత్రిమ మేధ భద్రత, క్వాంటమ్ సురక్షిత సాంకేతికతలపై దృష్టి సారించనున్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుకు చెందిన 2.45 లక్షల మంది ఉద్యోగుల్లో 1.81 లక్షల మంది సైబర్ భద్రతపై ఆన్‌లైన్ శిక్షణ పూర్తి చేసినట్లు ఎస్‌బీఐ వెల్లడించింది.

ఎలక్ట్రిక్ కార్లకు హెచ్‌డీఎఫ్‌సీ రుణం

ఖరీదైన ఎలక్ట్రిక్ కార్ల కొనుగోలును సులభతరం చేసేందుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రత్యేక రుణ పథకాన్ని ప్రారంభించింది. 'ఫ్లెక్సీ ఎలక్ట్రిక్ కార్ లోన్' పేరుతో అందిస్తున్న ఈ పథకంలో కారు బాడీ, బ్యాటరీకి వేర్వేరుగా రుణ మొత్తాలను నిర్ణయించే వెసులుబాటు ఉంది. బ్యాటరీకి సంబంధించిన రుణాన్ని సుదీర్ఘ కాలంలో తిరిగి చెల్లించవచ్చని బ్యాంకు తెలిపింది. ఇక ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడాకు పూర్తిస్థాయి అనుబంధ సంస్థ అయిన 'బాబ్ సెక్యూరిటీస్ అండ్ గిల్ట్‌లైడ్జ్' కార్యకలాపాలు ప్రారంభించింది.


నాలుగు రోజుల నష్టాలకు బ్రేక్

- సెన్సెక్స్ 483 పాయింట్ల లాభం.. 22,750 ఎగువకు నిఫ్టీ మెటల్, టెలికాం షేర్ల జోరు
- ముడిచమురు, అంతర్జాతీయ పరిణామాలపై మదుపర్ల అప్రమత్తత

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు నాలుగు రోజుల వరుస నష్టాల నుంచి కోలుకున్నాయి. విలువ ఆధారిత కొనుగోళ్లు, మెటల్, టెలికాం, హెల్త్‌కేర్ షేర్ల ర్యాలీతో సోమవారం లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 482.92 పాయింట్లు (0.66%) పెరిగి 73,606.75 వద్ద, నిఫ్టీ 153.20 పాయింట్లు (0.68%) లాభపడి 22,753.20 వద్ద స్థిరపడ్డాయి. సెన్సెక్స్‌లో అదానీ పోర్ట్స్ 2.72 శాతం, ఎటర్నల్ 2.56 శాతం, కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.53 శాతం లాభపడ్డాయి. బీఎస్‌ఈ మెటల్ సూచీ 2.55 శాతం, టెలికాం 2.07 శాతం, హెల్త్‌కేర్ 1.85 శాతం పెరిగాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా 1.48%, 1.45% చొప్పున ఎగిశాయి. బ్రెంట్ ముడిచమురు ధర 1.60 శాతం తగ్గి బ్యారెల్‌కు 114.8 డాలర్లకు చేరింది. అయినప్పటికీ అధిక చమురు ధరలు, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ప్రధాన కేంద్ర బ్యాంకుల వడ్డీ నిర్ణయాలపై మదుపర్లు అప్రమత్తంగా ఉన్నారని నిపుణులు తెలిపారు. గత నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 1,605, నిఫ్టీ 546 పాయింట్లు నష్టపోయాయి. శుక్రవారం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.887.65 కోట్ల షేర్లను కొనుగోలు చేశారు.

పేటీఎంకు పది రెట్లు లాభం

- క్యూ2లో రూ.225 కోట్ల నికర లాభం
- 28శాతం వృద్ధితో రూ.2,648 కోట్లకు ఆదాయం



న్యూఢిల్లీ: పేటీఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ సెప్టెంబరు త్రైమాసికంలో రూ.225 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే సమయంలో లాభం రూ.21 కోట్లుగా ఉంది. దీంతో వరుసగా ఆరో త్రైమాసికంలోనూ లాభాలు ఆర్జించింది. నిర్వహణ ఆదాయం 28 శాతం పెరిగి రూ.2,648 కోట్లకు చేరింది. కంపెనీ ఈబీఐటీడీఏ 90 శాతం వృద్ధితో రూ.270 కోట్లకు చేరగా, మార్జిన్ 10 శాతంగా నమోదైంది. పేటీఎం యూపీఐ లావాదేవీల విలువ 42 శాతం పెరిగింది. నెలవారీ లావాదేవీలు చేసే వినియో గదారుల సంఖ్య 8.5 కోట్లకు చేరింది. ఆర్థిక సేవల ఆదాయం 49 శాతం వృద్ధితో రూ.912 కోట్లకు చేరగా, సెప్టెంబరు చివరికి నగదు నిల్వలు రూ.13,617 కోట్లుగా నమోదయ్యాయి.

విదేశీ పార్సిల్ సేవల్లోకి బ్లూ డార్ట్

- అమెరికాకు కొత్త సేవలు.. బ్రిటన్, కెనడాకు విస్తరణ
- 50 గ్రాముల నుంచి 11 కిలోల పార్సిళ్ల రవాణా

ముంబై: లాజిస్టిక్స్ సంస్థ బ్లూ డార్ట్ 'ఇంటర్నేషనల్ పార్సిల్ కనెక్ట్' పేరుతో అంతర్జాతీయ పార్సిల్ సేవలను ప్రారంభించింది. భారత్ నుంచి అమెరికాకు ఈ–కామర్స్ ఉత్పత్తులను పంపించే ఈ సేవల ద్వారా 50 గ్రాముల నుంచి 11 కిలోల వరకు పార్సిళ్లను రవాణా చేయవచ్చు. దుస్తులు, పుస్తకాలు, హస్తకళలు, ఆటో విడిభాగాలు తదితర ఉత్పత్తులకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. డీహెచ్ఎల్ ఈ–కామర్స్ సహకారంతో నిర్వహించే ఈ సేవలను త్వరలో బ్రిటన్, యూరప్, కెనడా, ఆస్ట్రేలియాలకు విస్తరించాలని సంస్థ యోచిస్తోంది.

వివాదంలో ప్రభాస్ ఫౌజీ..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, దర్శకుడు హను రాఘవపూడి కలయికలో తెరకెక్కుతున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ' అనూహ్య వివాదంలో చిక్కుకుంది. సినిమా గ్లింప్స్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు సంబంధించిన సన్నివేశాలపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. నేతాజీ మునిమనవడు చంద్రకుమార్ బోస్ ఈ విషయంపై స్పందిస్తూ దర్శకుడు హను రాఘవపూడిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. సినిమాలో చారిత్రక వాస్తవాలను వక్రీకరించేలా సన్నివేశాలను చిత్రీకరించారని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా హిట్లర్‌తో నేతాజీ భేటీకి సంబంధించిన సన్నివేశాన్ని చూపించిన విధానం ఆయన గౌరవానికి భంగం కలిగించేలా ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు. సృజనాత్మక స్వేచ్ఛ పేరుతో చరిత్రను తప్పుగా చూపించడం సమంజసం కాదని, ఈ విషయంలో చిత్రబృందం భారత ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామంతో 'ఫౌజీ' గ్లింప్స్ చుట్టూ వివాదం మొదలైంది. సామాజిక మాధ్యమాల్లోనూ ఈ అంశంపై చర్చ జరుగుతోంది. పలువురు నెటిజన్లు చంద్రకుమార్ బోస్



అభ్యంతరాలకు మద్దతు తెలుపుతూ చిత్రబృందం వివరణ ఇవ్వాలని కోరుతున్నారు. మరికొందరు చారిత్రక వ్యక్తులను తెరపై చూపించే సమయంలో వాస్తవాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ప్రచార పోస్టర్, గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచగా, తాజాగా తలెత్తిన వివాదం చర్చనీయాంశంగా మారింది. ఇక ఈ చిత్రంలో ప్రభాస్ సరసన ఇమాన్వి ఇస్మాయిల్ కథానాయికగా నటిస్తున్నారు. బాలీవుడ్ ప్రముఖ నటులు మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్‌తో పాటు చైత్ర జె. ఆచార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్, టీ–సిరీస్ ఫిల్మ్స్ సంయుక్తంగా భారీ స్థాయిలో నిర్మిస్తున్నాయి. ఈ చిత్రాన్ని 2027 మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అయితే తాజాగా తలెత్తిన వివాదంపై చిత్రబృందం ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. నేతాజీ పాత్ర చిత్రణపై వస్తున్న అభ్యంతరాలకు దర్శకుడు హను రాఘవపూడి, నిర్మాతలు వివరణ ఇస్తారా? లేక సన్నివేశాల్లో మార్పులు చేస్తారా? అన్నది తెలియాల్సి ఉంది. మొత్తానికి భారీ అంచనాల మధ్య రూపొందుతున్న 'ఫౌజీ' చారిత్రక పాత్ర చిత్రణ కారణంగా ఇప్పుడు వార్తల్లో నిలిచింది.



టాలీవుడ్

వరుస అవకాశాలతో దూసుకుపోతున్న అందాల భామ మీనాక్షి చౌదరి త్వరలోనే 'వృషకర్మ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా, కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పౌరాణిక నేపథ్య ఉత్కంఠభరిత చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం సినిమా కోసం ప్రత్యేకంగా నిర్మించిన భారీ గుహ సెట్‌ను సందర్శించిన మీడియా ప్రతినిధులతో మీనాక్షి చౌదరి సరదాగా ముచ్చటించారు. ఈ సందర్భంగా సినిమా విశేషాలను పంచుకుంటూ.. 'వృషకర్మ' తనకు అద్భుతమైన అనుభవాన్ని అందించిందని తెలిపారు. ప్రేక్షకులు గతంలో ఎన్నడూ చూడని సరికొత్త ప్రపంచాన్ని ఈ చిత్రం ద్వారా ఆవిష్కరించబోతున్నామని చెప్పారు. సినిమా కోసం రూపొందించిన గుహ సెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని, అందులోకి అడుగుపెట్టినప్పుడు నిజంగానే మరో ప్రపంచంలోకి వెళ్లిన అనుభూతి కలుగుతుందని వివరించారు. ఈ చిత్రంలో తనకు అన్నింటికంటే నచ్చిన అంశం కథను, పాత్రలను తీర్చిదిద్దిన విధానమని పేర్కొన్నారు. దర్శకుడు కార్తీక్ దండు పాత్రలకు ప్రాధాన్యమిస్తూ కథను రూపొందించారని, ప్రతి

'వృషకర్మ' కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది

పాత్రలోనూ ఏం జరుగుతుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో కొనసాగుతుందని అన్నారు. తెరపై కనిపించే సన్నివేశాలు కేవలం కల్పిత ప్రపంచంలా కాకుండా, నిజ జీవితంలో జరుగుతున్న అనుభూతిని కలిగించేలా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని ప్రశంసించారు. నిజ జీవితంలో తాను ఎప్పుడూ గుహలోకి వెళ్లలేదని, అయితే ఈ సినిమా ద్వారా అలాంటి అనుభూతిని ప్రత్యక్షంగా పొందానని మీనాక్షి తెలిపారు. 'వృషకర్మ'కు ప్రత్యేకమైన శైలి, కథన విధానం ఉన్నాయని, ఇందులో భాగం కావడం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందని చెప్పారు. తన కెరీర్‌లో ఈ చిత్రం చాలా ముఖ్యమైనదని, నటిగా తనకు ఒక గొప్ప అనుభవాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. విభిన్నమైన కథాంశం, భారీ సెట్లు, పాత్రల ప్రాధాన్యంతో రూపొందుతున్న 'వృషకర్మ' ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ అనుభూతిని అందిస్తుందని మీనాక్షి చౌదరి ఆశాభావం వ్యక్తం చేశారు.

అభిమానులు గర్వపడేలా చేస్తా: అజిత్

కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ ఓవైపు సినిమాలతో బిజీగా ఉంటూనే, మరోవైపు తనకు ఎంతో ఇష్టమైన కార్ రేసింగ్‌లోనూ సత్తా చాటుతున్నారు. తాజాగా విదేశాల్లో జరిగిన కార్ రేసింగ్ సందర్భంగా ఆయన భావోద్వేగానికి గురయ్యారు. ''ఏదో ఒక రోజు నా అభిమానులు గర్వపడేలా చేస్తా. నన్ను ఎంతో ఆప్యాయంగా స్వాగతించిన జట్లకు, డ్రైవర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు. ఇక సినిమాల విషయానికొస్తే.. అజిత్ త్వరలో 'డేర్ డెవిల్' అనే క్రేజీ ప్రాజెక్టుతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ప్రతిభావంతుడైన దర్శకుడు అధిక్ రవిచంద్రన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. వీరిద్దరి కలయికలో గతంలో వచ్చిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తర్వాత తెరకెక్కుతున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మరో విశేషమేమిటంటే.. ఈ చిత్రంతో అజిత్ సతీమణి షాలిని నిర్మాతగా మారుతున్నారు. 'బ్రేవ్‌హార్ట్స్ ప్రొడక్షన్' పతాకంపై ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ నవంబరు 2 నుంచి ప్రారంభం కానుంది. అజిత్ రేసింగ్ ఆసక్తి, సినీ ప్రయాణం రెండింటిపైనా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.





మళ్లీ జంటగా ప్రభుదేవా, సిమ్రాన్!

ఒకప్పుడు తమ డ్యాన్స్, నటనతో వెండితెరపై ప్రేక్షకులను అలరించిన హిట్ జోడీ ప్రభుదేవా, సిమ్రాన్ దాదాపు 27 ఏళ్ల విరామం తర్వాత మరోసారి ఒకే తెరపై సందడి చేసేందుకు సిద్ధమయ్యారు. వీరిద్దరి కలయికలో ఓ సరికొత్త ప్రేమకథా చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాకు 'కమల్ శ్రీదేవి' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. క్రిష్ణానంద్ కొట్టారపట్టు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిథున్ జై శంకర్, మోహా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతాన్ని అందిస్తున్నారు. జయాన్ ఫిల్మ్స్, ఎంఆర్‌పీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై సౌందర్య రజినీకాంత్, మగేష్ రాజ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రేమ, అనుబంధాలు, భావోద్వేగాల నేపథ్యంలో సాగే ఈ సినిమా ప్రేక్షకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందిస్తుందని చిత్రబృందం చెబుతోంది. ముఖ్యంగా ప్రభుదేవా, సిమ్రాన్ జంటగా నటిస్తుండటం ఈ ప్రాజెక్టుపై ఆసక్తిని పెంచుతోంది. గతంలో తమ ప్రతిభతో అభిమానులను ఆకట్టుకున్న ఈ ఇద్దరు తారలు ఇన్నేళ్ల తర్వాత కలిసి నటిస్తుండటంతో వారి అభిమానుల్లోనూ ఉత్సాహం నెలకొంది. మరోవైపు, ఈ సినిమా గురించి సిమ్రాన్ సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు. 'ఇదొక కొత్త ప్రయాణం.. ఎంతో ప్రత్యేకమైన సినిమా. దీని కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. మీరంతా 'కమల్ శ్రీదేవి' అందించే అనుభూతిని పొందాలని నేనూ ఎంతో ఉత్సాహంగా ఉన్నాను' అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు. సిమ్రాన్ వ్యాఖ్యలతో ఈ సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. ప్రభుదేవా, సిమ్రాన్ కలయిక, ఆకట్టుకునే ప్రేమకథ, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి. మరి ఈ కొత్త జోడీ వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.

రజనీతో నయనతార

ఐదోసారి

సూపర్‌స్టార్ రజినీకాంత్ ఇటీవల 'జైలర్–2'తో విజయాన్ని అందుకున్న తర్వాత మరో ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా చిత్రం 'ధర్మన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. అశ్వథ్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రాశి ఖన్నా, సిమ్రాన్, రామ్ పోతినేని కీలక పాత్రల్లో నటిస్తున్నారు. లోకనాయకుడు కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన రజినీకాంత్ తొలి ప్రచార చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంది. చేతిలో రక్తపు మరకలున్న శస్త్రచికిత్స కత్తితో 'ది డెడ్లీ డాక్టర్' అనే విభిన్నమైన లుక్‌లో కనిపించిన ఆయన, సినిమాపై ఆసక్తిని పెంచారు. ప్రస్తుతం చిత్రీకరణ వేగంగా కొనసాగుతుండగా, ఈ ప్రాజెక్టులో లేడీ సూపర్‌స్టార్ నయనతార కూడా కీలక పాత్రలో నటించనున్నట్లు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ వార్తలకు తెరదించుతూ చిత్రబృందం అధికారిక ప్రకటన చేసింది. నయనతార 'ధర్మన్'లో భాగమైనట్లు వెల్లడిస్తూ ప్రత్యేకమైన ప్రచార పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో రజినీకాంత్, నయనతార ఎదురెదురుగా నిలబడిన నీడల రూపంలోని దృశ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ పోస్టర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. గతంలో 'చంద్రముఖి', 'కథానాయకుడు', 'దర్బార్', 'పెద్దన్న' చిత్రాల్లో కలిసి నటించిన రజినీకాంత్, నయనతార మరోసారి జోడీగా కనిపించనుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. వీరిద్దరి కలయికలో వస్తున్న ఐదో చిత్రంగా 'ధర్మన్' ప్రత్యేకతను సంతరించుకుంది. విభిన్నమైన కథాంశం, రజినీకాంత్ కొత్త అవతారం, నయనతార పాత్రతో ఈ సినిమా ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

ఫ్యాన్స్‌కు విశ్వక్ సేన్ క్షమాపణలు

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటిస్తూ, స్వయంగా దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'కట్ట' విడుదలకు సిద్ధమవుతోంది. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా దసరా కానుకగా అక్టోబరు 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. వెంకటేశ్ నటిస్తున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంతో పోటీగా విడుదల కానుండటంతో ఈ సినిమాపై ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాల్లో భాగంగా హైదరాబాద్‌లోని సారథి స్టూడియోలో విశ్వక్ సేన్ అభిమానులతో ఫొటోలు దిగేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే నిర్వాహకులు ఊహించిన దానికంటే భారీ సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో అక్కడ గందరగోళం నెలకొంది. జనసందోహం ఒక్కసారిగా పెరగడం, తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో విశ్వక్ సేన్ కార్యక్రమం మధ్యలోనే అక్కడి నుంచి వెళ్లిపోవాల్సి వచ్చింది. దీంతో ఎంతో ఆశగా తమ అభిమాన హీరోతో ఫొటోలు దిగేందుకు వచ్చిన పలువురు నిరాశతో వెనుదిరిగారు. ఈ ఘటనపై విశ్వక్ సేన్ సామాజిక మాధ్యమాల వేదికగా స్పందిస్తూ అభిమానులకు క్షమాపణలు తెలిపారు. అభిమానుల నుంచి వచ్చిన ప్రేమ, స్పందన తాము ఊహించిన దానికంటే ఎంతో ఎక్కువగా ఉందని, అంచనాలకు మించి జనం తరలిరావడంతో పరిస్థితిని నిర్వహించడం కష్టమైందని




వివరించారు. ప్రతి ఒక్కరినీ కలిసి ఫొటోలు దిగాలని అనుకున్నప్పటికీ, సరైన ఏర్పాట్లు లేకపోవడం, ఒక్కసారిగా జనసందోహం పెరగడంతో అందరినీ కలవలేక పోయానని తెలిపారు. తనతో ఫొటో దిగాలనే ఆశతో వచ్చి ఆ అవకాశం దక్కక నిరాశకు గురైన అభిమానులందరికీ క్షమాపణలు చెప్పారు. త్వరలోనే మరింత మెరుగైన ఏర్పాట్లతో మరో ఫ్యాన్ ఫొటో సెషన్ నిర్వహించి, ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. తనపై అభిమానులు చూపిస్తున్న ప్రేమకు, ఎప్పుడూ అండగా నిలుస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

టాలీవుడ్

డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీలకు కొంతకాలంగా విజయాలు ఆశించిన స్థాయిలో దక్కకపోయినా, ఆమె క్రేజ్ మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తూ, టాలీవుడ్‌తో పాటు ఇతర భాషల్లోనూ అవకాశాలు అందుకుంటూ కెరీర్‌లో బిజీగా కొనసాగుతున్నారు. గ్లామర్‌తో పాటు అద్భుతమైన డ్యాన్స్, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ తాజాగా మరో భారీ ప్రాజెక్టులో నటించే అవకాశం దక్కించుకున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తేజ సజ్జా కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఫాంటసీ యాక్షన్ చిత్రం 'మిరాయ్ 2'లో కథానాయికగా శ్రీలీలను ఎంపిక చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమాలోని పాత్ర కోసం ఇప్పటికే ఆమెకు స్క్రీన్ టెస్ట్ కూడా నిర్వహించినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'మిరాయ్' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడంతో, దాని కొనసాగింపుగా రూపొందుతున్న రెండో భాగంపై సహజంగానే భారీ అంచనాలు నెలకొన్నాయి. తేజ సజ్జా, దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై ఆసక్తి పెరుగుతోంది. ఇప్పటికే సినిమా చిత్రీకరణ ప్రారంభమై శరవేగంగా కొనసాగుతున్నట్లు

'మిరాయ్ 2'లో శ్రీలీల.. క్రేజీ కాంబోకు రంగం సిద్ధం

సమాచారం. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రతినాయకుడిగా రానా దగ్గుబాటి నటిస్తుండటం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఫాంటసీ ప్రపంచం, యాక్షన్ సన్నివేశాలు, ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమాను భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక తేజ సజ్జా సరసన శ్రీలీల నటిస్తే తెరపై ఈ జోడీ ఎలా ఉంటుందన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. తన డ్యాన్స్, ఎనర్జిటిక్ నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీలకు ఈ చిత్రం మరో పెద్ద అవకాశంగా మారుతుందని సినీ అభిమానులు భావిస్తున్నారు. ఇప్పటికే వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఆమె ఖాతాలో 'మిరాయ్ 2' చేరితే కెరీర్‌కు మరింత ఊపు వచ్చే అవకాశం ఉంది. అయితే శ్రీలీల ఎంపికపై అధికారిక స్పష్టత వచ్చే వరకు ఈ వార్తలను ప్రచారంగానే చూడాల్సి ఉంటుంది. మొత్తానికి, తేజ సజ్జా–శ్రీలీల కాంబినేషన్ నిజమైతే 'మిరాయ్ 2'పై అంచనాలు మరింత పెరగడం ఖాయమని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.





Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.